# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :81 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 27-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఉక్రెయిన్‌పై అతి పెద్ద గగనతల దాడి

కీవ్: కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ బాంబు మోతలతో దద్దరిల్లింది. రష్యా దాడిలో ఉక్రెయిన్‌లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. 60 మందికిపైగా గాయపడ్డారు. 80 నివాస భవనాలు సైతం ధ్వంసమయ్యాయి. దాదాపు 27 చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఇరాన్ రూపొందించిన షాహెద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించింది. రష్యా దాడులకు భయపడి వందలాది ఉక్రెయిన్ పౌరులు అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్లలోకి వెళ్లి తలదాచుకున్నారు.

## మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై సీఎం రేవంత్ తక్షణ చర్యలు!



హైదరాబాద్,హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఈవెంట్, ఊహించని రీతిలో ఒక తీవ్రమైన వివాదంలో చిక్కుకుంది. మిస్ ఇంగ్లాండ్ మిలా మాగీ చేసిన సంచలన ఆరోపణలు అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ అంశం జాతీయ, అంతర్జాతీయ మీడియాలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. నిర్వాహకులు ఈ ఆరోపణలను ఖండించినప్పటికీ, వివాదం తీవ్ర రూపం దాల్చింది. మిస్ ఇంగ్లాండ్ మిలా మాగీ చేసిన ఆరోపణలు, దేశంలో మహిళల భద్రత, గౌరవంపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తాయి. హైదరాబాద్ లాంటి మెట్రో నగరంలో, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఒక ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ఇలాంటి ఆరోపణలు రావడం అందరినీ కలవరపరిచింది. ఈ విషయం తెలంగాణ రాజకీయ వర్గాలలోనూ తీవ్ర దుమారం రేపింది. మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా స్పందించాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ అంశంపై గట్టిగా మాట్లాడారు. ఈ ఘటన మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న ఒత్తిడి, ప్రజల ఆందోళనను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ వివాదంపై తీవ్రంగా స్పందిస్తూ, విచారణకు ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న కీలక నిర్ణయం ఏమిటంటే, ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ కమిటీలో కేవలం మహిళా అధికారులే ఉండడం, ఈ విచారణ పట్ల ప్రభుత్వం ఎంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలనుకుంటుందో తెలియజేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన మహిళా ఐపీఎస్ అధికారుల బృందం, మిస్ ఇంగ్లాండ్ మిలా మాగీ చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపనుంది. ఈ విచారణలో భాగంగా కొన్ని అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఆమె హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చారు, ఎక్కడ బస చేశారు, ఎవరెవరితో కలిశారు వంటి వివరాలను సేకరిస్తారు. ఈవెంట్‌లో ఆమె ఎవరెవరితో సంభాషించారు. వారి మధ్య ఎలాంటి సంభాషణలు జరిగాయి అనే కోణంలో దర్యాప్తు చేస్తారు. ఆమెకు అసౌకర్యం కలిగించినట్లు పేర్కొన్న డిన్నర్ ఈవెంట్ వివరాలు, అందులో పాల్గొన్న వ్యక్తులపై విచారణ జరుగుతుంది. ఈవెంట్ నిర్వాహకులు, స్పాన్సర్ల ప్రవర్తన, వారి ప్రోటోకాల్స్, భద్రతా చర్యలు ఎలా ఉన్నాయి అనేవి పరిశీలిస్తారు. ఈవెంట్‌లో పాల్గొన్న మహిళలందరి భద్రత, గౌరవం కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారు, అవి సరిపోతాయా లేదా అనేది కమిటీ తనిఖీ చేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ తక్షణ నిర్ణయం, ఈ వివాదాన్ని ప్రభుత్వం ఎంత సీరియస్‌గా తీసుకుందో స్పష్టం చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ చర్య ద్వారా ఒక బలమైన సందేశాన్ని పంపాలనుకుంటోంది. తెలంగాణ గడ్డపై స్థానిక మహిళలైనా, విదేశీ మహిళలైనా ఎవరి పట్ల అయినా అగౌరవం, అనుచిత ప్రవర్తనను ఎంతమాత్రం సహించదు. ప్రస్తుతం ఈ విచారణ జరుగుతోంది. దీని ఫలితాల కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మిలా మాగీ చేసిన ఆరోపణలలో వాస్తవం ఎంత, ఈ ఘటనకు బాధ్యులు ఎవరు అనేది విచారణలో వెల్లడి కావాలి. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ చర్య సరైన అడుగుగా, మహిళా భద్రత పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా ప్రజలు భావిస్తున్నారు.

## పాక్ ఉగ్రవాదుల పుట్ట.. ప్రపంచంలో మరెక్కడా అంత మంది లేరు

న్యూఢిల్లీ,ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు వివిధ పార్టీల ఎంపీల నాయకత్వంలోని బృందాలు ప్రపంచదేశాలకు వెళ్లాయి. భాజపా నేత బైజయంత్ పాండా నేతృత్వంలోని బృందం బహ్రెయిన్ లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా బృంద సభ్యుల్లో ఒకరైన జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తంతో పోల్చితే పాకిస్థాన్‌లోనే అత్యధిక సంఖ్యలో ఉగ్రవాదులున్నారని విమర్శించారు. బహ్రెయిన్ వివిధ మతాల సమ్మేళనమని, ప్రజల్లో ఎటువంటి విభేదాలు లేవని అన్నారు. ఇది ఓ మినీ ఇండియాలా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అఖిల పక్ష బృందంలో ఉన్న తామంతా వేర్వేరు పార్టీలకు చెందినవారిమైనా.. ఐక్యంగా ప్రపంచ దేశాల ముందుకు వచ్చామన్నారు. కానీ, పాక్ మతపరమైన భావజాలంతో ఏర్పడిన దేశమని.. అయినా కూడా అక్కడి వారిలో ఐక్యత లోపించిందని విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్‌తో సహా ప్రపంచ దేశాలతో సత్సంబంధాలు కొనసాగించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. పాక్ అధినేతలతో శాంతి చర్చలు జరపడానికి అనేకసార్లు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ పై అక్కడి నేతలకు వివరిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ కేవలం ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు చేసిందని.. సాధరణ ప్రజలకు ఎటువంటి నష్టం కలిగించలేదన్నారు. అయినప్పటికీ దాయాది



దేశం భారత సరిహద్దు ప్రాంతాల్లోని పౌరులపై దాడులకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' రూపంలో ఉగ్రస్థావరాలపై విరుచుకుపడింది. పీఓకే, పాక్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. తర్వాత పాక్ రెచ్చగొట్టే చర్యలను మన బలగాలు తిప్పికొట్టాయి. ఈనేపథ్యంలోనే కేంద్రం దౌత్య యుద్ధాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా భారత్ ఉగ్రవాదులపై జరిపిన దాడుల గురించి ప్రపంచ దేశాలకు వివరించడానికి ప్రతినిధి బృందాలను విదేశాలకు పంపింది.

## విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాద భీమా..



హైదరాబాద్ : విద్యుత్ కార్మికులకు కోటి రూపాయలకు పైబడి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉదయం ప్రజాభవన్ లో ఎన్ పి డిసిఎల్ సి పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కు తో పాటు విద్యుత్ శాఖలో నరేష్ సతీమణికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు. విద్యుత్ కార్మికునికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోని సాధ్యం అయ్యింది అన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన, ప్రయత్నం చేయలేదని తమ ప్రభుత్వం వచ్చాకే ఇది సాధ్యం అయింది అన్నారు. ప్రమాద బీమా మరియు కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు, కార్యాచరణకు , మానవీయ కోణానికి అద్దం పడుతుంది అన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టి అనంతరం విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకువచ్చిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కోటి రూపాయల పైబడి ప్రమాద బీమా విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికుల అందరిలో ఓ కొత్త భరోసా నింపుతుంది అన్నారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్ పి డిసిఎల్ సి ఎండి వరుణ్ రెడ్డిని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి విద్యుత్తు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వడోదరలో మోదీ పర్యటన... 30 వేల మంది మహిళలు పూలు చల్లుతో ఘన స్వాగతం

వడోదర : ఆపరేషన్ సింధూర్ తర్వాత తొలిసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో నేడు పర్యటిస్తున్నారు. గుజరాత్‌లో రెండురోజుల పర్యటనలో భాగంగా.. ప్రధాని మోదీ వడోదరలో రోడ్‌షోతో పర్యటనను ప్రారంభించారు. త్రివర్ణపతాకాలతో ప్రధానికి వడోదర ప్రజలు ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. ప్రధాని మోదీకి నారీశక్తి స్వాగతం పలికింది.. మోదీకి 30వేల మంది మహిళలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కాగా.. గుజరాత్‌లోని వడోదరలో ప్రధాని మోదీ పాల్గొన్న సింధూర్ సమ్మాన్‌యాత్రలో కల్నల్ సోఫియా ఖురేషీ కుటుంబం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోఫియా ఖురేషీ- వడోదర చెందినవారు. ఆమె కుటుంబీకులు అక్కడే స్థిరపడ్డారు. ప్రధాని మోదీ వడోదరలోనే రోడ్‌షో చేయడంతో, ఖురేషీ కుటుంబసభ్యులు- రోడ్‌షోలో స్పెషల్‌గా కనిపించారు. మోదీపై కల్నల్ సోఫియా ఖురేషీ కుటుంబ సభ్యులు పూలవర్షం కురిపించారు..



ప్రధాని మోదీకి పూలు చల్లుతూ ఖురేషి కుటుంబసభ్యులు స్వాగతం పలకగా.. ప్రధాని మోదీ వారికి అభివాదం చేశారు.

## కవిత తిరుగుబాటును కేసీఆర్ ముందే ఊహించారా?

హైదరాబాద్,బీఆర్ ఎస్ పార్టీ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత.. ఆపార్టీ అధినేత, తన తండ్రి కేసీఆర్‌కు రాసిన లేఖ సంచలనం సృష్టిస్తూనే ఉంది. ఆమె దాదాపు తిరుగుబాటు చేసినంత పనిచేశారన్న విశ్లేషణలు కూడా వస్తు న్నాయి. అయితే.. ఈ విషయాన్ని కేసీఆర్ ముందుగానే ఊహించారా? ఆయన ఎప్పుడో అలెర్ట్ అయ్యారా? ఏదో ఒక రోజు కవిత బయట పడతారని ఆయన భావించారా? అంటే.. ఇప్పటి వరకు జరిగిన పరిణామాల ను గమనిస్తున్న వారు ఔననే అంటున్నారు. గత ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించారు. అప్పుడు.. వేదికపై సాధారణంగా కవిత ఫొటో కూ డా ఉంటుందని ఊహించారు. కానీ, ఆమె పేరు కానీ.. ఊరుకానీ.. ఎక్కడా ప్రస్తావించలేదు. పైగా వేదికపై కేసీఆర్ ఫొటో(కటౌట్) పక్కన కేటీఆర్ కౌటౌట్ మాత్రమే కనిపించింది. అంటే.. దాదాపు దీనిని బట్టి తన తర్వాత. పార్టీ వారసుడు ఎవరు ? అనేది కేసీఆర్ సుస్పష్టం చేశారని పార్టీ నాయకులు చెబుతున్నారు. అంతేకాదు.. పార్టీ తరపున ఏ కార్యక్రమం నిర్వహించే బాధ్యతనైనా కేటీఆర్‌తోనే కేసీఆర్ సంప్రదిస్తున్నా రు. సో.. దీనినిబట్టి.. కవితకు పార్టీలో నాయకురాలిగా మాత్రమే కేసీఆర్ గుర్తించారు తప్ప.. ఆమెకు బాధ్యతా యుతమైన పదవులు ఇచ్చేందుకు అంగీకరించలేదన్న పరిస్థితి కూడా అర్థమవుతుందని పరిశీలకులు చెబుతున్నారు. ఇదొక్కటే కాదు.. కవిత లిక్కర్ కేసులో ఇరుక్కుని జైలుకు వెళ్లిన నేపథ్యంలో ఆమెకు పార్టీ తరపున ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో అంత వరకు మాత్రమేపరిమితం చేశారు. పైగా.. కేటీఆర్ తో పోల్చుకుంటే.. కవిత రాజకీయంగా అనేక మెట్లు ఎక్కాల్సి ఉం



దన్న అభిప్రాయంలోనూ కేసీఆర్ ఉన్నారు. కేటీఆర్ ఇప్పటి వరకు రాజకీయంగా ప్రజాక్షేత్రంలో ఓడింది లేదు. కానీ, కవిత నిజామాబాద్‌లో తొలిసారి విజయం దక్కించుకున్నా.. 2019 పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం ఆమె ఓడిపోయారు. ఇది కూడా ఆమెకు రాజకీయంగా ఇబ్బంది కలిగించింది. పైగా. కేటీఆర్‌కు ఉన్న బ్రాండ్ ఇమేజ్.. ప్రజల్లో ఉన్న పలుకుబడి.. వంటివికవితకు తక్కువగానే ఉన్నాయి. పైగా కేసీఆర్ వారసుడిగా పార్టీ కేటీఆర్‌నే అనుమతిస్తుందన్నది అనేక సందర్భాల్లోనూ రుజువైంది. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకునే తన వారసుడిగా .. కేటీఆర్ వైపే కేసీఆర్ మొగ్గు చూపారన్నది విశ్లేషకులు చెబుతున్నారు.

## భారత్ 'బాయ్‌కాట్' వేళ.. తుర్కియే-పాక్ తొలి భేటీ



ఇస్తాంబుల్:ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సాయం చేసిన తుర్కియేపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆ దేశ ఉత్పత్తులను నిషేధించాలంటూ 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం మార్మోగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ తో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భేటీ అయ్యారు. ఇస్తాంబుల్‌లో ఆదివారం రాత్రి వీరి సమావేశం జరిగింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పాక్ ప్రధాని చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. "నా ప్రియమైన సోదరుడు ఎర్డోగాన్‌తో గౌరవప్రద భేటీ జరిగింది. భారత్‌తో ఉద్రిక్తతల సమయంలో మాకు అండగా నిలిచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలను సమీక్షించాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. పాక్-తుర్కియే స్నేహబంధం సుదీర్ఘకాలం కొనసాగాలి" అని షెహబాజ్ షరీఫ్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. దీనిపై ఎర్డోగాన్ కూడా స్పందించారు. ఇరు దేశాల మధ్య బలమైన స్నేహబంధం ఉందని అన్నారు. రాజకీయ, వాణిజ్య రంగాల్లో చారిత్రక బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత వీరిద్దరూ భేటీ అవడం ఇదే తొలిసారి. భారత్-తుర్కియే మధ్య విభేదాలు నెలకొన్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచమంతా ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తున్న సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఎర్డొగాన్ కలిసిన సంగతి తెలిసిందే. ఆ దేశానికి వత్తాసు పలికారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించలేదు సరికదా.. మృతి చెందిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి కూడా వ్యక్తం చేయడానికి ఆయన ఇష్టపడలేదు. ఇక, 'ఆపరేషన్ సిందూర్' సమయంలోనూ డ్రోన్ల సాయమే కాకుండా.. తుర్కియే తమ సైనిక సిబ్బందిని కూడా పంపినట్లు వార్తలు వచ్చాయి. పాక్ ప్రయోగించిన వాటిల్లో చాలా వరకు ఆ దేశానికికు చెందిన 'అసిస్ గార్డ్ సోనగర్' డ్రోన్లుగా గుర్తించారు. దీంతో భారత్‌లో తుర్కియేపై నిరసన సెగ మొదలైంది.

## రాహుల్ గాంధీపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

హైదరాబాద్,బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై ట్విట్టర్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశాన్ని బలహీనపర్చే విధంగా పలు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది ఒక సుదీర్ఘ ప్రణాళికలో భాగంగా ఇది జరుగుతోందని.. దేశ భద్రత, సమగ్రత, అభివృద్ధిని దెబ్బతీసేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

కిషన్ రెడ్డి ఎత్తి చూపిన రాహుల్ వ్యాఖ్యలు

స్వదేశీ రక్షణ రంగంపై చిన్నచూపు:

రాహుల్ గాంధీ విదేశీ సాంకేతికతలను, ముఖ్యంగా ఇతర దేశాల డ్రోన్లను ప్రశంసిస్తూ.. భారత స్వదేశీ రక్షణ రంగంలో సాధించిన ప్రగతిని ఎద్దేవా చేశారేని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

రఫేల్ ఒప్పందంపై ఆరోపణలు:

భారత వాయుసేనను ఆధునీకరించేందుకు తీసుకువచ్చిన రఫేల్ జెట్ కొనుగోలును రాహుల్ గాంధీ కుంభకోణంగా పేర్కొన్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ రక్షణ ప్రణాళికలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఆయన వ్యాఖ్యలున్నాయన్నారు.

అగ్నివీర్ పథకానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ స్కీమ్‌ను రాహుల్ గాంధీ విమర్శించడం ద్వారా, భారత



సైనికులను అవమానించారని.. రక్షణ రంగంలో జరిగిన విప్లవాత్మక మార్పులను తిరస్కరించారని కిషన్ రెడ్డి ఆరోపించారు.

'మేక్ ఇన్ ఇండియా' పథకంపై విమర్శలు:

స్వదేశీ ఉత్పత్తి, ప్రత్యేకంగా రక్షణ రంగంలో స్వావలంబనను పెంపొందించే ప్రయత్నాలను, మేకిన్ ఇండియా ప్రయత్నాలను రాహుల్ గాంధీ కించపరిచారని కిషన్ రెడ్డి తన ట్వీట్‌లో వివరించారు. రాహుల్ ఎవరి కోసం మాట్లాడుతున్నారో ఒకసారి ప్రజలు అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని.. కిషన్ రెడ్డి హైలెట్ చేశారు.

## కాంగ్రెస్ కు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప షాక్..



కొమురంభీం: కాంగ్రెస్ పార్టీకి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప షాకిచ్చాడు. కాంగ్రెస్ పార్టీతో కోనప్ప తెగతెంపులు చేసుకున్నారు. కాంగ్రెస్‌కు దూరంగానే ఉన్నానని.. దూరంగానే ఉంటానని, రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ%"% ఏ పార్టీ లోకైనా వెళ్తా కానీ.. కాంగ్రెస్‌లోకి మాత్రం పోనని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ లో చేరానని.. కానీ, కాంగ్రెస్ 16 నెలల పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దేవుడు అని ఇదివరకే తాను చెప్పానని, ఆయనకు పాదాభివందనాలని కాంగ్రెస్ పార్టీలో చేరిన రోజే చెప్పానని కోనప్ప అన్నారు. తనను వ్యక్తిగతంగా దూషించిన వ్యక్తిని పార్టీలో తీసుకునేటప్పుడు చెప్పలేదనే బిఆర్ఎస్ నుంచి బయటికి వచ్చానని.. రాజకీయంగా బిఆర్ఎస్, కెసిఆర్ కుటుంబంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. తాను మళ్లీ బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్తాను కానీ కాంగ్రెస్ పార్టీలోకి మాత్రం వెళ్లను కోనప్ప చెప్పారు.

## సంపాదకీయం

మంగళవారం 27-05-2025

# దుబారా పథకాలను సమీక్షించాలి !

ఈ మధ్య తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ఆదాయం పెంచడమెలా అన్న దానిపై అధికారులతో వరుస సమీక్షలు చేశారు. ఆదాయాలు తెచ్చిపెట్టే శాఖల్లో అలసత్వం లేకుండా చూడాలని, అవసరమైతే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించాలని సూచించారు. ఉన్న ఆదాయాలను ఎకాఎకిన డబుల్ కావాలని కోరుకుంటున్నారు. ఎందుకంటే వీరు ఓటు బ్యాంక్ కోసం అమలు చేస్తున్న పథకాలకు నిధులు కావాలి. చేసిన అప్పులకు వడ్డీలు కట్టాలి. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న టాస్క్ ఇదే..రోడ్లు వేయడం, ఆస్తులను కట్టడం, విద్యారంగానికి కేటాయింపులు పెంచడం,ఉద్యోగ ఖాళీలను పూర్తిగా భర్తీ చేయడం వంటివన్నీ తదుపరి ప్రాధాన్యంలో ఉన్నాయి. అప్పులకు వడ్డీలు కట్టడం, జీతాలు, పెన్షన్లు ఇవ్వడంతోనే ప్రభుత్వాల పనితీరు సరిపోతోంది. కొత్త పథకాలు. ఆలోచనలు లేకుండా పోతున్నాయి. దీనికంతటికీ గుదిబండ పథకాలు,పెన్షన్లే ప్రధాన కారణమని చెప్పుకోవాలి. అయితే ఆదాయం పెరగాలని చూస్తున్న ముఖ్యమంత్రులు ఖర్చులను తగ్గించుకోవడం, దుబారాలు తగ్గించడం, గుదిబండ పథకాలను పక్కన పెట్టడంపై ఆలోచన చేయడం లేదు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం గుదిబండగా మారింది. ఇటీవల ఇంటింటికీ బియ్యం సరఫరా పేరుతో జరిగిన దోపిడీకి ఏపి ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. ఇచ్చే రూపాయి బియ్యం కూడా వాహనాల ద్వారా ఇంటింటికి పంపిణీకి గత జగన్ ప్రభుత్వం చేపట్టగా దానిని ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. గుడ్డిలో మెల్ల అన్నచందంగా ఇది కొంత ఆదా అయినట్లే భావించాలి. అలాగే దీనివల్ల లబ్దిపొందుతున్న వారిలో ఎంతమంది అర్హుల్లో గుర్తించడం లేదు. గుడ్డిగా బియ్యం సరఫరా చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనీసం సగం కార్డుదారులు అనర్హులని ఏ గ్రామం వెళ్లినా ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారిని ఏరివేస్తే సగం భారం తప్పుతుంది. కానీ ఓట్లతో ఇమిడివున్న పథకం కావడంతో పాలకులు దీనిజోలికి పోవడం లేదు. పేదలకు పట్టెడన్నంపెట్టాలన్న సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆరామారావు 1983 ఉగాది రోజు ప్రారంభించారు. పేదలకు అన్నం పెట్టాలన్న ఆలోచనతో ఉమ్మడి ఏపిలో కిలో రెండు రూపాయాల బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టారు. దాదాపు 42 ఏళ్ల కిందటి మాట. కానీ ఇప్పుడు అదే బియ్యం ధర 40 నుంచి 50కిచేరింది. కానీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కిలో రూపాయికే బియ్యం ఇస్తున్నారు. ఈ బియ్యాన్ని అమ్ముకోవడం, వ్యాపారం చేసుకోవడం అన్నది జరుగుతోంది. చాలామంది హోటళ్లకు అమ్ముకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై దాదాపు 26రూపాయలకు పైగానే సబ్సిడీ ఇస్తోంది. ఇలా ఖర్చుతో కూడుకున్న పథకం అమలు చేయడం ఎంతవరకు న్యాయం. ప్రజల డబ్బును దుబారా చేస్తున్న ఈ పథకం విధానాన్ని సమీక్షించాలి. ఆదాయ పథకాలపై కాకుండా దుబారా పథకాలపైనా సమీక్షిస్తే నిజాయితీ తెలుస్తుంది. పక్కదారి పడుతున్న పథకంపై కన్నేయాల్సిందే. నిరుపేదలకు ఉచిత పథకాలపై సమీక్షించ కుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదు. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకాలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల జేబులు నింపుతోంది. సిబ్బంది కొరత, కొరవడిన తనిఖీలకు ప్రజల అమాయకత్వం జత కలవడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. బియ్యం అక్రమ రవాణా చేయడం నిత్యకృత్యంగా మారినా అరికట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి ప్రేక్షక పాత్రకు పరిమితమవు తున్నారు. ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేస్తే కనీసం ఓ వేయికోట్లు నెలకు ఆదా అవుతాయని ప్రజలు కూడా అంటున్నారు. కొందరు డీలర్లు కార్డులను తమ వద్దే ఉంచుకొని బియ్యాన్ని స్వాహా చేసన్తూ రాష్ట్రాలను దాటిసన్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అమాయక ప్రజలు చేసేది లేక ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆనాటి ముఖ్యంత్రి ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు బియ్యం అందచేయాలన్న లక్ష్యంతో కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని అమలు చేశారు. ఆనాడది సంచలన నిర్ణయంగా నిలిచింది. ఆ తరవాత చంద్రబాబు సిఎం అయ్యాక దానిని ఐదు రూపాయలకు పెంచారు. దీంతో కొంత దుబారా తగ్గిందనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ కిలో రెండు రూపాయలకు చేశారు. ఇలా చేయడం వల్ల కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలు దాగి ఉన్నాయి. దీనిని కిరణ్ కుమార్ రెడ్డి సర్కార్ కిలో రూపాయికే మార్చడం ద్వారా దుబారాకు తెరలేపారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల ఏదో ఘనకార్యం చేశామని గొప్పగా ప్రకటించుకున్నారు. తెలంగాణలో మరో అడుగు ముందుకేసి ఇప్పుడు సన్నబియ్యం సరఫరా చేసి గొప్పలు చెప్పుకుంటున్నారు. పేదవారి ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేశామని మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పలు చెబుతున్నారు. రూపాయికి కొతఖర కూడా లభించని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్నికొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. చంద్రబాబు మరో అడుగు ముందుకు వేసి దీనిని కూడా నగదు బదిలీగా మార్చాలని చూస్తున్నారు. అంటే నేరుగా డబ్బులు పందేరం చేయడమన్న మాట. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి ఉండదు. ఓట్ల కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఈ ఒక్క పథకం చాలు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో అనేక పథకాలను సమీక్షించాల్సి ఉంది. ఆదాయాలు తెచ్చే శాఖలపై కాదు..ఆదాయాలు పోతున్న శాఖలపైనా సమీక్షించాలి. కిలో బియ్యం పథకంతో పాటు, పేదలకు ఇస్తున్న పెన్షన్లు తదితర పథకాలను కూడా సమీక్షించాలి. ఖచ్చితంగా నిరుపేదలకే పథకాలు అమలయ్యేలా చూడాలి.

# కశ్మీర్ విద్యార్థులు నేరస్థులా?



జమ్మూ కాశ్మీర్: ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన మారణకాండను యావద్దేశం గర్హించింది. పర్యాటకులు ఏ మతం వారో పట్టిపట్టి ఆరా తీసి ఉగ్రవాదులు కాల్పులు జరపడం దేశం మొత్తం ముక్తకంఠంతో ఖండించింది. ఇప్పుడు అదే రీతిలో కశ్మీర్‌లోయ కాకుండా బయట ఉత్తరాది ప్రాంతాల్లో కశ్మీరీలపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. కశ్మీరీ అయితే చాలు వారి దాడులకు బలైనట్టే. ఈ దాడులకు పాల్పడుతున్న వారికి ఉగ్రవాదులకు తేడా ఏం లేదు. పహల్గాం ఉగ్రదాడితో ఎలాంటి సంబంధం లేకపోయినా, విద్యార్థులను, వ్యాపారులను నేరస్థులుగా ఇతర ప్రాంతాల్లో అనుమానించడం, దాడులు చేయడం తరచుగా జరుగుతున్నాయి. పహల్గాం సంఘటన జరిగిన ఆరురోజుల్లోనే ఈవిధంగా దేశం మొత్తం 17 సంఘటనలు జరిగాయి. ఎక్కువగా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో ఒక వర్గానికి చెందిన మితవాద వర్గాల దురుసుతనమే ఈ సంఘటనల వెనుక కనిపిస్తోంది. పంజాబ్‌లో కశ్మీర్ విద్యార్థులను క్యాంపస్‌లోనే కర్రలతో, పదునైన ఆయుధాలతో దాడి చేశారు. ఉత్తరాఖండ్‌లో కాలేజీలనుంచి వెళ్లిపోవాలని బెదిరించారు. ఢిల్లీలో జామియా, మిలియా ఇస్లామియా విద్యార్థిపై దౌర్జన్యం చేశారు. హిమాచల్‌ప్రదేశ్, ముస్సోరీలో కశ్మీరీ శాలువాలు విక్రయించే వ్యాపారులపై దాడులు జరిగాయి. కశ్మీర్‌లో ఏదైనా హింస జరిగితే కశ్మీరీలంతా అనుమానితులవుతుండడం పరిపాటిగా సాగుతోంది. పహల్గాం ఉగ్రదాడి బాధాకరమైన వాస్తవాన్ని వెల్లడించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న కశ్మీర్ విద్యార్థులకు భద్రత గాలిలో దీపంలా తయారైంది. దేశంలో వీరికి భద్రత కల్పించే పటిష్టమైన, వ్యవస్థాపరమైన యంత్రాంగం లేదు. అలాగని వారి భద్రతను ప్రజల భావోద్వేగాలతో మారుతున్న అభిప్రాయాలకు విడిచిపెట్టకూడదు. పహల్గాం వంటి దాడులకు పాల్పడే ముష్కరుల లక్షం కేవలం చంపడమే కాదు, సమాజాన్ని చీల్చడం, ప్రజల్లో నమ్మకాన్ని పోగొట్టడం, సామాజిక సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడం, సామాజిక వర్గాల్లో అనుమానాలను ప్రేరేపించడం. ఈ నేపథ్యంలో మనం స్పష్టంగా తెలుసుకోవలసింది కశ్మీరీ విద్యార్థులను హింసించడం దేశభక్తిలో భాగం కాదు. దేశాన్ని అంతర్గతంగా చీల్చాలనుకుంటున్న వారికి విద్యార్థులను దాసోహం చేయడమే అవుతుంది. ఈ హింసాకాండలు కొత్తేమీ కావు. కశ్మీర్ లోయలో ఏదైనా హింసాత్మక సంఘటన జరిగినా లేదా సైనికులు ముష్కరులకు బలైపోయినా, కశ్మీరీ విద్యార్థులకే తరచుగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. చాలా మంది విద్యార్థులు పేదరికంతోను, సంఘర్షణలతోను సతమతమవుతున్నా ఉన్నత చదువుల ద్వారా చక్కని భవిష్యత్ కోసం నిరీక్షిస్తున్నారు. వీరికి అన్ని విధాలా సహకారం అందడానికి బదులు కేవలం కశ్మీరీ అయినందున నేరస్థులుగా అనుమానించడం శోచనీయం. యూనివర్శిటీలు, ఇతర విద్యాసంస్థలు వీరిని పీడించే బందిఖానాలుగా మారుతుంటే పాలనా యంత్రాంగాలు పట్టించుకోవడం లేదు. కాలేజీ నిర్వాహకులు, చట్టాలు, పౌరసమాజం వారిని దేశసంక్షోభ సమయాల్లో బలిపశువులు కాకుండా చూడాలి. వారి ఫిర్యాదులను పరిష్కరించే అధికారులను నియమించాలి. వివక్షకు తావు లేని విధానాలు అమలు చేయాలి. స్థానిక పోలీస్‌ల సహకారంతో వారికి మూకుమ్మడి దాడులనుంచి రక్షణ కల్పించాలి. విధానాలకు అతీతంగా వారి మానసిక క్షోభను నివారించే ప్రయత్నం చేయాలి. క్లిష్ట పరిస్థితుల్లో ఈ విద్యార్థులు తీవ్ర ఆవేదనకు, మానసిక నైరాశ్యానికి గురవుతున్నారు. దేశం పట్ల వారు తమ విధేయతను నిరూపించుకునేలా అవకాశం కల్పించాలి. దేశంలోని మరే ఇతర విద్యార్థి వర్గాలకు ఇలాంటి దుస్సంఘటనలు ఎదురు కాకుండా చూడాలి. ఇలాంటి చర్యలు తీసుకోకుంటే విద్యార్థుల్లో భయం పెరిగి, తమ గుర్తింపు ఎవరికీ తెలియకుండా కాలేజీ క్యాంపస్‌ల్లో దాక్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేక సుదీర్ఘకాల ఆందోళనలో మగ్గిపోవలసి వస్తుంది. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది జ్ఞాపకాలను నిజంగా మనం మన్నించాలనుకుంటే మతపరమైన ప్రతీకార ఉచ్చులో మనం ఇరుక్కోకూడదు. సంస్థాగత సంకల్పానికి మనం స్పందించాలి. అంతర్గతంగా సాగుతున్న ఈ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలి. క్లిష్టపరిస్థితుల్లో కశ్మీరీ విద్యార్థులకు ఎక్కడా, ఏ విద్యాసంస్థల్లోనూ వేధింపులు, బెదిరింపులు, దాడులు ఎదురు కాకుండా ఒక జాతీయ స్థాయి విద్యావిధానాన్ని అమలు చేయడం తప్పనిసరి. సామాజిక, సామరస్య వాతావరణాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఒక హింసాత్మక సంఘటన చాలన్న ముష్కరుల జోస్యానికి అవకాశం ఇవ్వరాదు. హింసకు మన సమాధానం ఐక్యత తప్ప పగ, ప్రతీకారం కారాదు. మనబలం కరుణే తప్ప ప్రతిదాడి కారాదు. కశ్మీరీ విద్యార్థులు కోరుకునేది మన నుంచి అనుమానం కాదు, మనం అందించే సంఘీభావం. ఇప్పుడు మనకు కావలసింది కశ్మీరీ విద్యార్థులకు పటిష్టమైన భద్రతా చర్యలు కల్పించడం. అమాయకులైన యువత నేరారోపణకు బలికాకుండా వారిని రక్షించుకోవడానికి మనం కృతనిశ్చయులమై ఉండాలి. పహల్గాం దాడి సమయంలో వివిధ ప్రాంతాల పర్యాటకులను కులమతాలకు అతీతంగా ఆదరించి అక్కున చేర్చుకున్నది కశ్మీర్ ముస్లింలే అన్న వాస్తవాలను మరిచిపోరాదు. బాధితులకు ఆపన్నహస్తం అందించిన కశ్మీర్ లోయపైన, అక్కడి ప్రజలపైన, విద్యార్థులపైన ఎక్కడైనా వివక్ష చూపించడమంటే మనకు మనం శత్రువులం కావడమే.

# ప్రపంచ దౌత్యయాత్ర ... అంతరంగిక రాజకీయాలు

న్యూఢిల్లీ,“ డిప్లమాటిక్ అవుట్ రీచ్” పేరుతో ఒక దౌత్య ఉద్యమాన్ని భారతదేశం మొదలుపెట్టింది. ఏడు బృందాలు, ముప్పైరెండు దేశాలలో పర్యటించి, అక్కడి ప్రభుత్వ ప్రతినిధులను, రాజకీయనేతలను, ప్రభావశీలురను కలిసి పెహెల్‌గామ్ దగ్గర నుంచి ఆపరేషన్ సిందూర్ దాకా జరిగిన పరిణామాలను, పాకిస్థాన్ కొన్ని దశాబ్దాలుగా సరిహద్దు ఆవలి నుంచి భారత్ లో సృష్టిస్తున్న ఉగ్రవాద అశాంతిని వివరించి చెప్పనున్నాయి. ఈ అనధికార దౌత్యబృందాలలో దేశంలోని వివిధ రాజకీయపక్షాల ప్రతినిధులు, దౌత్య, విదేశాంగ వ్యవహారాల నిపుణులు, మాజీ రాయబారులు ఉన్నారు. భద్రతాసంఘంలో శాశ్వత సభ్యదేశాలను, తాత్కాలిక సభ్యదేశాలను, త్వరలో తాత్కాలిక సభ్యత్వం పొందే దేశాలను లక్ష్యంగా పెట్టుకుని ఈ యాత్రలు జరుగుతున్నాయి. పాకిస్తాన్ ప్రస్తుతం భద్రతాసంఘం తాత్కాలిక సభ్యదేశంగా ఉండి, అక్కడ తన ప్రభావాన్ని కొంత చూపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ బృందాల సభ్యులు పర్యటనలు ప్రారంభించి, ఆయా దేశాలలో వార్తాపత్రికలు, చానెళ్లకు భారత– పాక్ ఉద్రిక్తతల మీద ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. భారతవైఖరిని వివరిస్తున్నారు. ఈ దౌత్య ఉద్యమం మంచిది. ఎటువంటి దౌత్య ప్రయత్నమైనా సమస్య యుద్ధాల దాకా వెళ్లకుండా నివారిస్తుంది. ఇతర మార్గాల ద్వారా పరిష్కారానికి ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ సమాజానికి విషయాన్ని వివరించడం న్యాయపక్షాన్ని బలపరుస్తుంది. అన్యాయపక్షాన్ని బలహీనం చేస్తుంది. పొరుగుదేశం పై భారతదేశం ఒక కఠినచర్య తీసుకోవలసి వచ్చినప్పుడు, దాని పూర్వాపరాల విషయంలో అనేకరకాల కథనాలు, వాదనలు ప్రపంచంలో వ్యాప్తిలో ఉన్నప్పుడు, తన వైఖరిని, వాదనను భారతదేశం వినిపించాలి. ఆ స్వరం భారతదేశంలో ఒక పక్షానిదో, ఒక వర్గానిదో కాకూడదు. ఆంతరింగికంగా రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా, జాతీయ ప్రయోజనాల విషయంలో దేశమంతా ఒకటే అన్న సంకేతం ఉండాలి. అందుకే ఈ దౌత్యయాత్రా బృందాలలో అన్ని పార్టీలకు ప్రాతినిధ్యం ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. అంతే కాదు, ప్రతి బృందంలో కనీసం ఒక ముస్లిం ఉండాలన్న విధానాన్ని కూడా అనుసరించింది. రాజకీయంగా, సామాజికంగా అందరినీ కలుపుకుపోతామన్న సూచన ప్రపంచానికి ఇవ్వడం కూడా ఒక సానుకూల అంశం. ఇతర దేశాల నుంచి మద్దతును కూడగట్టుకోవడమే కాదు, పాకిస్థాన్ ప్రచారాలను ఓడించడం కూడా భారత్ కు అవసరం అవుతుంది. అనేక ప్రయోజనాల పరస్పరతల మీద దేశాల మధ్య సంబంధాలు ఆధారపడి ఉంటాయి. నేటి ప్రపంచవ్యవస్థలో దేశాల మధ్య సంబంధాలకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. వలసవాద కాలం నుంచి, ప్రచ్ఛన్నయుద్ధ కాలం వరకు ఏర్పడిన కూటములు, మైత్రులు, వైరసంబంధాలు, ఏకధ్రువ ప్రపంచమని అనుకుంటున్న కాలంలో కూడా కొనసాగాయి. భారత–పాక్ ఉద్రిక్తతలకు స్వాతంత్ర్యపూర్వ కాలం నుంచి, అమెరికా–సోవియెట్ శిబిరాల కాలం నుంచి వారసత్వ చరిత్ర ఉంది. అనేక పశ్చిమదేశాల వైఖరులు పాక్–భారత్ విషయాల్లో భారత్ కు వ్యతిరేకంగా కనిపించడానికి కారణం అదే. ప్రాంతీయశక్తిగా ఎదుగుతున్న ఇండియా మీద వాటికి కొన్ని అనుమానాలు, భయాలు కూడా ఉండవచ్చు. తన విధానాల మీద ఆ దేశాలకు ఉన్న ప్రతికూల అభిప్రాయాలను సవరించాలంటే, భారత్ తన వ్యవహారసరళి ద్వారా విశ్వాసం కల్గించడం ఒక్కటే చాలదు, సరిహద్దు ఉగ్రవాద బాధిత దేశంగా ఎదుర్కొంటున్న కష్టనష్టాలను కూడా పూసగుచ్చినట్టు చెప్పాలి. పెహెల్‌గామ్ అనంతరం భారత్–పాక్ మధ్య జరిగిన స్వల్పకాల సంఘర్షణ విషయమై ప్రపంచదేశాలకు నివేదించాలని భారత్ అనుకోవడం వెనుక ఆలోచన అదే. అయితే, యుద్ధాలకు, ఘర్షణలకు దారితీయగల ద్వైపాక్షిక ఉద్రిక్తతలకు. దేశాల ఆంతరంగిక సమాజంలో కూడా ప్రభావాలు, ప్రయోజనాలు, పర్యవసానాలు ఉంటాయి. ప్రజాస్వామ్యంలో దేశ ప్రభుత్వాల వైఖరుల మీద సమాజంలో అనుకూల, ప్రతికూల అభిప్రాయాలుంటాయి. జాతీయ విధానాల మీద విమర్శలు ఉన్నట్టే, విదేశాంగ విధానం మీద కూడా స్వదేశంలో అభ్యంతరాలుంటాయి. పొరుగుదేశంతోనో,



శత్రుదేశంతోనో యుద్ధం వచ్చినప్పుడు, దేశమంతా ఒక్కతాటి మీద నిలబడాలన్నది ఎంతటి ఆమోదం కలిగిన విలువో, ఆ యుద్ధానికి దారితీసే ప్రభుత్వ విధాననిర్ణయాల మీద ఎప్పటికప్పుడు విమర్శలు చేయడంలో తప్పులేదనేది కూడా ప్రజాస్వామ్యంలో అంతే ఉన్నతమైన విలువే. ఆంతరంగికంగా తప్పులు చేసే రాజకీయపార్టీ లేదా దాని ఆధ్వర్యంలోని ప్రభుత్వం, బాహ్యవిషయాల్లో మాత్రం తప్పులు, ద్రోహాలు చేయదని ఏముంది? కొరియా మీద, వియత్నాం మీద, ఇరాక్ మీద, ఆఫ్ఘనిస్థాన్ మీద యుద్ధాలు చేసినప్పుడు, అమెరికన్ ప్రభుత్వ వైఖరికి అమెరికన్ సమాజం నుంచే విమర్శలు, వ్యతిరేకతలు వచ్చాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్ వైఖరుల గురించి పాక్ ప్రముఖులే అనేకులు విమర్శనాత్మకంగా మాట్లాడినవి మనం చూశాము. మన దేశంలో కూడా ఆపరేషన్ సిందూర్ నేపథ్య, అనంతర పరిణామాల విషయంలో ప్రతిపక్షాలు భిన్న వైఖరులు చూపించాయి. పెహెల్‌గామ్ సంఘటన కు భద్రతావైఫల్యాల కారణాన్ని వేలెత్తి చూపించాయి. పాకిస్థాన్ మీద చర్య తీసుకోవడానికి మీనమేషాలు లెక్కించడమేమిటని నిలదీశాయి. ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పుడు, దానికి పూర్తి మద్దతు ఇచ్చాయి, కానీ, కాల్పుల విరమణ సందర్భంలో అభ్యంతరాలు చెప్పాయి. అమెరికా అధ్యక్షుడి ప్రమేయాన్ని తప్పుపట్టాయి. ఈ కీలకమైన ఘట్టాలలో ప్రధానమంత్రి కశ్మీర్ సందర్శించకపోవడాన్ని,అఖిల పక్ష సమావేశాలలో పాల్గొనకపోవడాన్ని గట్టిగా ప్రశ్నించాయి. జాతీయ అధికారపార్టీ బిజెపి కూడా, తక్కువేమీ తినలేదు. ఒకవైపున, ప్రతిపక్షాలతో సంప్రదిస్తూనే ఉంది. మరోవైపు, తన సామాజికమాధ్యమ శ్రేణుల ద్వారా, దిగువశ్రేణి రాజకీయ నాయకుల ద్వారా, ప్రతిపక్ష నేతల దేశభక్తి రాహిత్యాన్ని, పాక్ అనుకూలతను ప్రచారం చేస్తూ వచ్చింది. అంటే, పొరుగుదేశంతో ఘర్షణ వాతావరణంలో కూడా దేశంలో రాజకీయ పోరాటం సాగుతూనే వచ్చింది. పెహెల్‌గామ్ అనంతర పరిణామాలను భారతీయ జనతాపార్టీ బిహార్ తదితర రాష్ట్రాల ఎన్నికలలో అనుకూలంగా ఉపయోగించుకుంటుందన్న భయాలు ప్రతిపక్షాలకు ఉన్నాయి. పెహెల్‌గామ్ తరహా హత్యాకాండ వల్ల దేశంలో కలిగిన భయాందోళనల విభజన వాతావరణం నుంచి, పాకిస్తాన్ మీద చర్య తీసుకోవడం ద్వారా సమకూరే ప్రతిష్ఠ నుంచి బిజెపి రాజకీయంగా ఎక్కువగా లాభపడకుండా చూడడానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. అదే సమయంలో, టెర్రరిస్టుల స్థావరాల మీద గురిచూసి చేసిన దాడిని పదే పదే చెప్పుకోవడం ద్వారా, కలిగే సానుకూలతను పెంచుకోవాలని కేంద్రప్రభుత్వ పెద్దలు చూస్తున్నారు. కేంద్రప్రభుత్వ సారథులు, వారి పార్టీ మధ్య ఈ సందర్భంలో సరిహద్దురేఖ సహజంగానే అస్పష్టంగా మారిపోతుంది. మరి, నెలరోజులుగా దేశంలో జరుగుతూ వచ్చిన పరిణామాల మీద, ప్రభుత్వం తీసుకున్నచర్యలు–నిర్ణయాల మీద ప్రతిపక్షాలకు భిన్నమయిన అభిప్రాయాలు ఉన్నప్పుడు, దౌత్య ప్రచారయాత్రలో అందరూ కలసి ఎట్లా పాల్గొంటున్నారు? ఒకే వైఖరిని ఎట్లా చెబుతారు? అన్న సందేహాలు కలగడం సహజం. దౌత్య ప్రచారయాత్రలో జాతీయ ప్రయోజనాలతో పాటు, ప్రతిపక్షం తనతో గొంతుకలిపేట్టు చేసే రాజకీయప్రయోజనం కూడా కేంద్రప్రభుత్వం చూస్తోందా అన్న అనుమానాలూ కొందరికి ఉన్నాయి. అట్లాగే, ఈ దౌత్యప్రచార యాత్రకు ప్రతినిధులను ఎంపిక చేయడంలో కూడా రాజకీయ వివాదాలు

# చిత్తవుతున్న ధాన్యం రైతులు

ఆదిలాబాద్,ఎన్నిచర్యలు తీసుకున్నా,అధికారులు పర్యవేక్షిస్తున్నా రైతుకు దళారుల బెడద తప్పడం లేదు. గత్యంతరం లేని రైతులు మధ్య దళారులకే విక్రయిస్తున్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నా వారిని పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని ఓ వైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట కొనుగోళ్లు లేక కలవరపడుతున్నాడు. నిబంధనల పేరిట ప్రభుత్వరంగ సంస్థలు ఇబ్బంది పెడుతుంటే.. దళారులు ధర తగ్గించి పంట కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాల్లో దళారులది ఆడిందే ఆటగా మారింది. మొదట్లో పంట బాగానే ఉన్నా అకాల వర్షాల వల్ల పంట కొంత దెబ్బతింది. కొనుగోలులో అవకతవకలు జరగకుండా ఉండాలనే ఆలోచనతో రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. మధ్య దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోకుండా ఉండాలనే ఆలోచనతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయినా తేమశాతం పేరుతో తరుగు తీస్తున్నారు. అయితే అధికారులు నిబంధనలు పెట్టడంతో ఇప్పుడు పల్లెల్లోకి దళారులు వచ్చి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా కొందరు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఇలా ఏ గ్రామానికి వెళ్లినా మధ్య దళారులు ఇలా రైతుల ఇంటికి వెళ్లి తక్కువ ధరకే నేరుగాకొనుగోలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా వ్యవసాయాధికారులుగానీ, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# పెరిగిన ధాన్యం దిగుబడులు

భద్రాద్రి కొత్తగూడెం,గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధాన్యం దిగుబడి కూడా ఎక్కువగా పెరిగిందని అధికారులు అంటున్నారు. దీనికి తోడు ధాన్యం మద్దతు ధర కూడా పెరిగినందున రైతులు ఎక్కువ శాతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయాలు జరిపే అవకాశాలు ఉన్నాయి. దళారుల ప్రమేయం లేకుండా రైతులకు అన్ని సౌర్యాలు కల్పించారు. ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో వారి ఖాతాల్లో సొమ్ములను జమ చేశారు. రైతు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతుధర ఇచ్చిన కొను గోలు చేస్తోంది. అంచనాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జీసీసీ,ఐకేపీ, కోపరేటివ్ సొసైటీల ద్వారా ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అందుబాటులోకి గన్నీ బ్యాగ్‌లను కూడా ఉంచారు. రైతులు విక్రయానికి తీసుకు వచ్చిన ధాన్యానికి వెంటనే పేమెంట్లు చేసేవిధంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అన్నారు. రెండు లక్షల 30 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణ యించారు. ఇంకా కొన్ని ప్రాంతాల నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రాజెక్టుల కింద వరి కోతలు జరగనందున చాలా ధాన్యం పొలాల్లోనే ఉండిపోయింది.

# పంట మార్పిడితోనే మెరుగైన ఫలితాలు

విజయనగరం, రైతులు పంట మార్పిడి చేసుకోవడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు, పంటల దిగుబడి పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. ఏటా ఒకే పంట వెయ్యడం వలన దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదని తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులు పంట మార్పిడే కాకుండా కనీసం రకాలను మార్చడం లేదన్నారు. చెరకులో నూతన రకాలు ఉన్నాయని వాటిని సాగు చేసుకోవాలని చెప్పారు. విత్తనం నిమిత్తం ప్రత్యేకంగా తోటలు పెంచుకోవాలని వివరించారు. ఆరునెలల వయసు గల చెరకును విత్తనంగా వాడాలని చెప్పారు. చెరకులో బిందు సేద్యం ద్వారా నీరు, ఎరువులు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో ఏటా పూర్తిస్థాయిలో వర్షాలు పడుతున్నా కురుస్తున్న రోజుల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ఒకేసారి ఎక్కువ వర్షం పడుతోందని.. ఇదంతా వృథాగా పోతోందని వివరించచారు. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. బిందు సేద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులకు 90 శాతం రాయితీ ఇస్తున్నారని చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఇద్దరి మధ్య తేడా ఇదేనా?

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవహారశైలిపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి హోదాలో నాంపల్లి కోర్టుకు హాజరైన రేవంత్ రెడ్డి తనపై నమోదైన కేసులపై వాంగ్మూలమిచ్చారు. ఈ కేసులు, తీర్పులు ఎలా ఉన్నా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో కోర్టుకు రావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇదే సమయంలో వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి కోర్టు కేసులు, ఇతరత్రా విషయాలపై చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి కాకముందు నుంచి వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిపై ఎన్నో కేసులు ఉన్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రాకముందు ఆయన ప్రతి శుక్రవారం హైదరాబాదులోని సీబీఐ కోర్టుకు హాజరయ్యేవారు. ఎన్నికల ప్రచారం, పాదయాత్ర సమయంలో మాత్రం కోర్టు అనుమతితో మినహాయింపు పొందేవారు. అయితే ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ప్రతివారం కోర్టుకు హాజరవుతారా? అనేది పెద్ద చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి హోదాలో ఆయన కోర్టుకు హాజరైతే భద్రత నిమిత్తం రోజుకు సుమారు రూ.60 లక్షలు వరకు ఖర్చు అవుతుందని అప్పట్లో కోర్టుకు నివేదించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి విధుల్లో బిజీగా ఉన్నందున తనకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఐదేళ్లలో ఒక్కనాడు కోర్టు గుమ్మం ఎక్కకుండా తప్పించుకున్నారని గుర్తు చేస్తున్నారు. అదేవిధంగా 2019 ఎన్నికల ముందు వైసీపీ అధినేత జగన్ పై విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో దాడి జరిగింది. ఈ కేసులో జనిపల్లి శ్రీనివాసరావు అనే యువకుడిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఈ కేసులో సాక్ష్యం చెప్పాల్సిన జగన్ ఎన్ని నోటీసులిచ్చినా కోర్టుకు హాజరవ్వలేదు. ఏదో ఒక కారణం చూపి ఆయన సాక్ష్యం చెప్పకుండా తిరిగేవారని విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో జగన్ వ్యవహారశైలిపై నిందితుడు కుటుంబంతోపాటు పౌర హక్కుల నేతలు, న్యాయవాదులు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జగన్ ఒక్కసారి కోర్టుకు రావాల్సిందిగా వేడుకున్నారు. కానీ, ఆయన ఏనాడూ కోర్టు మెట్లు ఎక్కేందుకు ఇష్టపడలేదు. తాను ముఖ్యమంత్రి హోదాలో ఉండగా, కోర్టుకు వెళ్లి బోనులో నిల్చోవడమేంటన్న ఆలోచనతో జగన్.. కోర్టు విచారణకు దూరం ఉండేందుకు ఇష్టపడేవారని చెబుతున్నారు. ప్రతిపక్షాలు సైతం ఇవే తరహా విమర్శలు చేసేవి..ఇక ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం జగన్ కు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరికీ సంబంధం లేకపోయినా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా పనిచేసిన నేతల మధ్య సారూపత్యలు, భిన్న వ్యక్తిత్వాలపై తరచూ చర్చ జరుగుతుంటుంది.

# మృగాళ్లను బహిరంగంగా ఉరితీయాలి

అమరావతి,కఠిన చర్యలు తీసుకోక పోవడం, సకాలంలో శిక్షలు పడకపోవడం వంటి కారణాల వల్ల లైంగిక వేధింపులు, ప్రేమదాడులు, అత్యాచారాలు ఆగడం లేదు. మృగాళ్లు విజృంభిస్తూనే ఉన్నారు. అత్యాచార ఘటనలు సాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నా రోజూ ఎక్కో ఒకచోట ఘటనలు తారసపడుతున్నాయి. అలాగే వరుస ఘటనలు ఎపిలో ఆందోళన కలిగిస్తున్నాయి. మృగాళ్ల కారణంగా ఆడపిల్లలకు భయం కలుగుతోంది. మరీ ముఖ్యంగా చిన్నారులను కూడా ఈ రాక్షసులు వదిలి పెట్టడం లేదు. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు మరింత క్షోభకు గురవుతున్నారు. పటిష్ట చట్టం తీసుకుని రావడం నిజంగా అభినందనీయం అనుకున్న వారు కూడా ఇప్పుడు భయపడేలా పరిస్థితులు దాపురించాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సత్వర శిక్షలు అమలు చేయాలని యావత్ దేశం కోరుకుంటున్న వేళ కఠిన చట్టాన్ని తీసుకుని వచ్చి అమలు చేయాల్సిఉంది. కడప జిల్లాలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి, హత్య చేయడం కలకలం రేపింది. దీనిని బట్టి మృగాళ్లలో కించిత్ భయం కూడా కనిపించడం లేదు. కిరాతకుడని ఎన్‌కౌంటర్ చేయడమని ప్రజలాంతా నిలదీసారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు వంటి అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా చట్టాన్ని రూపొందించాలి. మహిళలపై అత్యాచారానికి పాల్పడితే అతి త్వరగా నిందితులకు మరణశిక్ష పడేలా చట్టం తీసుకొని రావాలి. ఇటువంటి కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించే ఆధారాలున్నప్పుడు మూడు వారాల్లోగా అంటే 21రోజుల్లో తీర్పు వచ్చేలా చట్టాలను కఠినం చేయాలి. కానీ ఇటీవలి ఘటనలు మృగాళ్లలో భయాన్ని కలిగించడం లేదని తెలిస్తోంది. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరకారించందనో లేక తనను ప్రేమించడం లేదనో లేకపోతే..ఒంటరి అమ్మాయిలను లేదా మహిళలను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రేప్‌లు చేయడం, హత్యలు చేయడం చాలా సులువైన పనిగా చూస్తున్నారు. ప్రతి జిల్లాలోను ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక ఘటనల్లో నేరాల విచారణకు ప్రతి జిల్లాల్లోను ప్రత్యే కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. అంతేకాదు సోషల్ మీడియా వేదికగా బాధిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలకు అడ్డుకట్టవేసేలా చట్టాన్ని రూపొందించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపాలి. నిజానికి ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని ఆడపిల్ల ఎదురు చూస్తోంది. అయితే చట్టాలు ఎన్ని ఉన్నా ప్రజల్లో మార్పులు మాత్రం రావడం లేదు. దుండగులను కఠినంగా అణచివేస్తే తప్ప మహిళలకు రక్షణ ఉండదని తేలిపోయింది. కఠినంగా అణచివేత చర్యలకు ఉపక్రమించాలన్ని సర్వత్రా విజ్ఞప్తులు వస్తున్నాయి. చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వారిని బహిరంగ ఉరితీసే విధానం రావాలి.

# ఉగ్రకదలికలపై దృష్టిసారించిన ఎన్ఐఏ

హైదరాబాద్,ఉగ్రకదలికలపై తీవ్ర దృష్టిసారించిన జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ, హైదరాబాద్‌లో కీలకంగా మకాం వేసిన సిరాజ్ అనే వ్యక్తి చుట్టూ దర్యాప్తును ముమ్మరం చేసింది. గత ఏడు సంవత్సరాలుగా గ్రూప్స్ పరీక్షల శిక్షణ పేరుతో హైదరాబాద్‌లో తిష్ట వేసిన సిరాజ్, పక్కా వ్యూహంతో కార్యకలాపాలను సాగించినట్లు అధికారులు గుర్తించారు. సిరాజ్‌తో కలిసి ఉన్న సమీర్ అనే వ్యక్తి – హైదరాబాద్, విజయనగరం, ఢిల్లీ, బెంగళూరు, ముంబైలో రెక్కీ చేసినట్లు– తెలిసింది. గత సంవత్సరం నవంబరు 22న ముంబయి అంధేరిలో జరిగిన ఓ మత కార్యక్రమానికి సిరాజ్, సమీర్ హాజరైనట్లు– విచారణలో వెల్లడైంది. అందులో అధాన్ ఖురేషి, దిల్వాన్, మొహిసిన్ షేక్, జసీర్ అలియాస్ అమన్, ఫహాద్, అమిర్ అన్సారీ వంటి వ్యక్తులెందరికీ సంబంధించిన సంబంధాలు కూడా వెలుగుచూశాయి.ఒమన్, సౌదీ దేశాల నుంచి సిరాజ్, సమీర్లకు ఆర్థిక సాయం అందినట్లు గుర్తించిన అధికారులు, ఆ ఛానెళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే యూపీకి చెందిన బాదర్ అనే వ్యక్తి, ఫర్హాన్ మోయినుద్దీన్ అనే వరంగల్ యువకునితో సిరాజ్ సంబంధాలు ఉన్నట్లు– తెలిసింది. బాదర్‌తో సిగ్నల్ యాప్ ద్వారా కాంటాక్ట్‌లో ఉండటం, ఫర్హాన్ కోసం ప్రత్యేకంగా నాలుగు బృందాల గాలింపు చర్యలు కొనసాగించడం ప్రస్తుతం దర్యాప్తులో కీలకాంశంగా మారింది. సిరాజ్ స్థాపించిన సంస్థలో సభ్యత్వం కలిగి ఉన్న ఇతరులను కూడా గుర్తించే ప్రయత్నంలో ఉన్న ఎన్ఐఏ, దేశీయంగా మరియు అంతర్జాతీయంగా ఉగ్రవాద అనుకూల స్వభావమున్న యువకులతో సంబంధాలను విపులంగా పరిశీలిస్తోంది. సిరాజ్, సమీర్ల ఎలాన్ ఏమిటన్నదానిపై క్లారిటీ– కోసం అధికారులు మరింత లోతుగా ఆరా తీస్తున్నారు. ఈ విచారణతో పాటు–, ఇతర అనుమానాస్పద చర్యలను పసిగట్టి ముందస్తు చర్యలు తీసుకునే దిశగా భద్రతా సంస్థలు సన్నద్ధమవుతున్నాయి.

# రాజకీయంలోనూ ఆడబిడ్డ వాటా

హైదరాబాద్,తల్లిదండ్రుల ఆస్తిలో ఆడబిడ్డకు వాటా.. భారతీయుల సంప్రదాయంలో భాగం. ఎంత పేదవారయినా తమ ఇంటి ఆడ పిల్లకు ఎంతో కొంత ఇస్తుంటారు.. ప్రస్తుత కాలంలో ఇది 'రాజకీయం'లోనూ అన్నట్లుగా మారింది. మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి దీనికి అద్దం పడుతోంది. ఇంకా చెప్పాలంటే ప్రాంతీయ పార్టీల్లో ఆడబిడ్డ వాటా గట్టిగా ప్రస్తావనకు వస్తోంది.తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విషయమే నిదర్శనం. పార్టీలో సమ స్థాయిని ఆమె కోరుకుంటున్నారని, ఇంకా ముందుకెళ్లి ప్రత్యామ్నాయంపై కూడా ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. మద్యం కేసులో అరెస్టయిన కవిత గత ఏడాది ఈ సమయంలో ఢిల్లీ తిహాడ్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. తన రాజకీయ భవిష్యత్ ను దెబ్బకొట్టిన బీజేపీపై ఆమె మహా గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తండ్రికి ఆరు పేజీల సుదర్ఘ లేఖ రాయడం కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ లో తాడోపేడో తేల్చుకునే ఉద్దేశంలో కూడా ఆమె ఉన్నట్లుగా చెబుతున్నారు. అసలు కవిత ఉద్దేశం ఏమిటో బయటపడాల్సి ఉంది. ఏదైనా సరే.. సోదరుడు కేటీఆర్, బావ హరీశ్ రావుతో సమానంగా ఆమె బీఆర్ఎస్ లో స్థాయిని కోరుకుంటున్నట్లు, పార్టీ విధానాలతో ఏకీభవిస్తున్నట్లు లేరని అర్థం అవుతోంది.మూడేళ్ల కిందట ఇదే సమయంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కూడా రాజకీయంగా సొంత అడుగులు వేసిన సంగతి తెలిసిందే. అన్న వైస్ జగన్ అధికారంలో ఉండగా.. అప్పట్లో ఆమె సొంత రాష్ట్రం ఏపీని వదలి తెలంగాణలో పార్టీ పెట్టడం కలకలం రేపింది. ఆ తర్వాత తెలంగాణ ఎన్నికలకు దూరంగా ఉండడం, పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడం ఇతర విషయాలు. రాజకీయ ప్రాధాన్యం విషయంలోనో, ఆర్థిక వివాదాలతోనో షర్మిల తన అన్న జగన్ ను విభేదించి సొంత పార్టీ పెట్టుకున్నారు. ఏపీకి తిరిగివెళ్లి అన్న ఓటమికి పరోక్షంగా కారణమయ్యారు.మహారాష్ట్రలో తిరుగులేని నాయకుడైన శరద్ పవార్.. ఎన్సీపీ

# మిస్ వరల్డ్‌లో రాజకీయ కుట్ర కోణం?

హైదరాబాద్,మిస్ ఇంగ్లండ్ మ్యాగీ వ్యవహార శైలి కాస్త అనుమానాస్పదంగానే ఉందంటున్నారు. బేసిగ్గా స్విమ్మర్ అయిన మ్యాగీ తన తల్లి నుంచి, స్విమ్మింగ్ నుంచి ఏమి నేర్చుకుందోగానీ కొన్నికొన్ని విషయాల్లో ఆమెను తీవ్రంగా అనుమానించాల్సి వస్తోందని అంటారు కొందరు.మిస్ వరల్డ్ పోటీలకు అనగా ఇప్పటికిప్పుడొచ్చిన నష్టం ఏమీ లేదు. ఎందుకంటే 1951లో ఫెస్టివల్ ఆఫ్ ఇంగ్లండ్ లో ఒక బికినీ షోతో మొదలైన ఈ పోటీలు.. ఆనాడే వివాదాస్పదం. ఆ తర్వాత అదిప్పటికి అరడజను సార్లకు పైగా రకరకాల వివాదాలతో తీవ్ర అభ్యంతరాలను ఎదుర్కొంది. తెలుపు– నలుపు, మతానికి సంబంధించి, ఆపై కోవిడ్ వంటి విషయాల్లో ఈ పోటీలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఆ మాటకొస్తే హైదరాబాద్ లోనూ వ్యతిరేకతలు ఎదురయ్యాయి. కొన్ని ప్రజా సంఘాల వారు ఈ పోటీలను తొలి నుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఇప్పుడు కూడా ఇక్కడ కూడా వ్యతిరేకించారు. అయితే ఇక్కడ మ్యాగీ విషయంలో కొన్ని అభ్యంతరాలేంటంటే.. ఇది ఒక ఇంగ్లండ్ కి సంబంధించిన పీజెంట్. ఆమె మరెవరో కాదు మిస్ ఇంగ్లండ్. అలాంటిది తన దేశానికి సంబంధించిన ఒక పోటీలో పాల్గొని.. ఎలాగోలా ఇక్కడి స్థితిగతులను అవగతం చేసుకుని వాటిని పూర్తి చేసి.. ముందుకెళ్లి కిరీటం దక్కించుకోవాలి. ఆమెకంటూ ఈ కిరీటం దక్కదనుకుందో ఏమో తెలీదు. కానీ ఆమె అయితే అర్ధాంతరంగా అది కూడా ఒక అబద్ధం చెప్పి తప్పుకుంది. తన తల్లికి బాగోలేదని ఆమె చెప్పడం విడ్డూరం. ఇది ఎప్పటికీ స్ఫూర్తి కాదు. రెండో విషయం ఇక్కడందరూ తననొక వేశ్యను చూసినట్టు చూస్తున్నారంటే.. అర్థమేంటి? ఇక్కడో మాట అక్కడో మాట చెప్పడంలో మీనింగ్ ఏమనుకోవాలి?అంటే మిగిలిన కంటెస్టెంట్లంతా వేశ్యలనా? లేక హైదరాబాద్ అంటే అతి పెద్ద విటుల సంఘమనా ఒక రకంగా చెబితే ఆమె చేసిన ఈ వ్యాఖ్యానాల వల్ల ఆమె ఒక్కరే శుద్ధ పూస మిగిలిన వారాంతా వ్యభిచారులని. అంతేగా దీనర్థం! మరో ముఖ్యమైన విషయం.. ఇటు వచ్చింది సాదా సీదా టూరిస్టుగా కాదు. ఒక దేశానికి ప్రతినిథిగా. పైపెచ్చు ఇదామె దేశానికి సంబంధించిన ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద బ్యూటీ ఈవెంట్. దాన్ని అపహాస్యం చేయడం అంటే తన దేశాన్ని సైతం అపహాస్యం చేయడంతో సమానం. మరో ఇంపార్టెంట్ థింగ్.. ఇది బ్యూటీ విత్ పర్పస్ గా 1980ల కాలం నాటి నుంచి ప్రాచుర్యం పొందింది. ఈ మొత్తం ఈవెంట్ ద్వారా సంపాదించిన మొత్తంలోంచి 1 బిలియన్ పౌండ్లను వికలాంగులు, అనాథ బాలలకు ఒక చారిటీగా ఇస్తారు. దీన్ని కూడా ఆమె కనీసం గుర్తించలేదు.ఇక పోతే హైదరాబాద్ కి లండన్ కొ ఒక పోలిక ఏంటంటే.. హైదరాబాద్ లోనూ లండన్లోనూ నదులుంటాయి. లండన్ నగర మధ్య భాగంలో థేమ్స్ నది ఉన్నట్టు.. ఇక్కడ కూడా మూసీ నది ఉంటుంది. ఈ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు నడుం బిగించింది. తాను వచ్చేటప్పుడు ఈ విషయం కూడా తెలుసుకుని.. తాను ఈ దిశగా ప్రపంచ వ్యాప్తంగా విరాళాలు సేకరించి తన వంతు బాధ్యత




తీసుకోవచ్చు. అదీ మిస్ చేసిందీ మిస్ ఇంగ్లండ్. ఇక పోతే.. వచ్చే రోజుల్లో ఈమె అందానికి దాని వెనక ఉన్న తెలివికి మెచ్చి పొరబాటున ఐక్యరాజ్య సమితి ఈమెకు ఏ సోమాలియాకో పంపి అక్కడి మహిళలల్లో సంస్కరణ తీసుకురావాలని.. వారికంటూ ఆత్మ విశ్వాసాన్ని నూరిపోయాలన్న బాధ్యతలను అప్పగిస్తూ ఒక అంతర్జాతీయ రాయిబారిగా పంపితే అక్కడ వారు ఇలా చేశారు అలా చేశారు. అక్కడి అరటిపండ్లు, ఒంటె పాలు నేను తాగలేక పోయానంటే ఎలా ఉంటుంది?ఇదిలా ఉంచండి. బేసిగ్గా మ్యాగీ ఒక స్విమ్మర్. స్విమ్మింగ్ ఏం చెబుతుంది? ఎన్నేసి అవాంతరాలు ఎదురైనా వాటిని ఈదుకుంటూ వెళ్లాలని. కనీసం ఆ స్పిరిట్ కూడా ఆమె కొనసాగించలేక పోయారు. ఫైనల్ గా ఇక్కడ మ్యాగీ వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఇక్కడున్న కొన్ని ప్రత్యర్థి పార్టీ ఎన్నారై లింకులు అక్కడ మ్యాగీ మదర్ ని మేనేజ్ చేసి ఉంటారేమో.. అని అంటున్నారు కొందరు. అంతే కాదు ఇక్కడ ఒక రాజకీయ పార్టీ కరపత్రిక ఈ విషయంపై ఎంతో ఆతృత కనబరచి.. తద్వారా ఆమెకు ఫోన్ చేసి మరీ ఈ విషయం ఒక క్లారిటీ తెచ్చుకుని.. అక్కడున్న తమ యూకే ప్రతినిథి చేత ఇది బ్రాండ్ హైదరాబాద్ ఇమేజీకే డ్యామేజీ కలిగించే అంశమంటూ స్టేట్మెంట్ ఇప్పించారంటే.. దీని వెనక ఏ రాజకీయ కుట్ర కోణం లేదనుకోవాలా? అంటున్నారట కొందరు. మరి చూడాలి.. ఇలాంటి కుట్ర కోణాలు ఇందులో మరేవైనా దాగి ఉన్నాయో తెలియాల్సి ఉందంటున్నారు వీరు. ఏది ఏమైనా మ్యాగీ చాలా పెద్ద తప్పు చేశారు. ఇటు తన ఇంగ్లండ్ సంస్థ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ కి, అటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీకి మాయని మచ్చ తెచ్చారు. అంతే కాదు తనతో పాటు పాల్గొన్న ఇతర కంటెస్టెంట్లను కూడా ఆమె ఒక రకంగా వేశ్యలని ఇండెరెక్ట్ స్టేట్మెంట్ ఇచ్చారు. ఇది తప్పకుండా కోటిన్నరకు పైగా జనాభాగల సగటు హైదరాబాద్ వాసి ఖండించాల్సి ఉందని అంటారు కొందరు సామాజిక వేత్తలు. మరి మీరేమంటారు?

# దయ్యాలతో నెయ్యం.. దేవుడితో కవిత కయ్యం



హైదరాబాద్,రాష్ట్రంలో పరిపాలన, శాంతిభద్రతల పరిస్థితి, మీడియాలో వస్తున్న వార్తలగురించి రోజూ ఉదయమే ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు బ్రీఫింగ్ ఇస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నిఘా విభాగం అధిపతి, సమాచార శాఖ కమిషనర్ రోజూ ఉదయమే మొట్టమొదట ముఖ్యమంత్రిని కలిసేవాళ్ళలో ఉంటారు. వాళ్లు ముఖ్యమంత్రికి ఈ అంశాలమీద బ్రీఫ్ చేస్తారు. వాళ్ళ బ్రీఫింగ్‌ను బట్టి ముఖ్యమంత్రి తానేం చేయాలో నిర్ణయించుకుంటూ ఉంటారు. ఇది ఇవాల్టి పద్ధతి కాదు, అనాదినుండి మన రాష్ట్రంలోనే కాకుండా దేశమంతా దాదాపుగా ఇలాగే జరుగుతుంది. ఈ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా కలవలేకపోయిన సందర్భాలలో కనీసం టెలిఫోన్లోనైనా బ్రీఫ్ చేయడం అనేది కొనసాగుతూ వచ్చిన పద్ధతి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు హయాంలో నిఘా విభాగం అధిపతిగా ఉండిన ఒక అధికారి అత్యంత గోప్యంగా ఉంచవలసిన శాంతిభద్రతలకు సంబంధించిన రోజువారీ నివేదికలను ముఖ్యమంత్రికి కాకుండా ఆయన మంచిచెడ్డలు చూసుకునే ఒక సన్నిహిత బంధువుకు చెప్పాల్సి వస్తున్నది,

ఇది పద్ధతికి విరుద్ధమని తన సన్నిహితులతో చెప్పుకొని వాపోయేవాడు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎక్కువ కాలం ప్రగతి భవన్లో ఉండి ఎవరికీ అందుబాటులో ఉండేవారు కాదని బయట ప్రచారం. ముఖ్యమంత్రిగా ఆయన సచివాలయానికి కూడా వెళ్లిన దాఖలాలు లేవు. మొత్తం ఆయన దాదాపు పది సంవత్సరాలు అధికారంలో ఉంటే ఏ మూడు నాలుగు సందర్భాల్లోనో సచివాలయానికి వెళ్లి ఉంటారు. అది ఆయన వ్యవహారశైలి. ఒక్కో ముఖ్యమంత్రికీ ఒక్కో రకమైన శైలి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ఉదాహరణగా తీసుకుంటే ఆయన దినచర్య ఉదయం నాలుగు గంటలకు మొదలయ్యేది. దాదాపు 5:30 నుండి ఆయన అధికారిక కార్యక్రమాలు మొదలైనట్టే. పైన పేర్కొన్న అధికారులు ఆయనకు బ్రీఫింగ్ ఇవ్వడం, సరిగ్గా తొమ్మిది గంటలకు గడియారం చూసుకుని క్యాంప్ ఆఫీస్ బయటకు వచ్చి ఆరోజు అక్కడికి వచ్చి వరుసలో నిలబడిన సామాన్య జనం ప్రతి ఒక్కరినీ స్వయంగా కలిసి వాళ్ల సమస్యలు విని మహజర్లు స్వీకరించి వాటికి సంబంధించి అధికారులకు ఆదేశాలు అక్కడికక్కడే జారీ చేసి తదుపరి క్యాంపు కార్యాలయంలో వేచి ఉన్న వాళ్లందర్నీ కూడా కలిసి 10:30 గంటలకల్లా సచివాలయం చేరుకునేవారు. ఇలా, ఒక్కొక్క ముఖ్యమంత్రి ఒక్కొక్క రకంగా పనిచేస్తుంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి రెండు రాష్ట్రాలుగా విడిపోయిన ఈనాటి వరకు 18 మంది ముఖ్యమంత్రులు పాలించారు. ఒక్కొక్కళ్ళది ఒక్కో తీరు. ముఖ్యమంత్రి రోజూ అందరినీ కలవడం అంటే కిందినుండి పైదాకా అధికార యంత్రాంగం, ఇతర ప్రజాప్రతినిధులు పనిచేయడం లేదన్నట్టే కదా, సమస్యలు ముఖ్యమంత్రిదాకా రావాల్సిన పరిస్థితి ఉందంటే పరిపాలనలో లోపం ఉన్నట్టే కదా అనే వాదన ఆ మధ్య మాజీమంత్రి కెసిఆర్ కుమారుడు కెటి రామారావు ఒక సందర్భంలో వినిపించారు. ఇవన్నీ నిజమే కానీ, ముఖ్యమంత్రులు అయినా ప్రధానమంత్రులు అయినా ఎంత పెద్దవారైనా సరే కుటుంబ సభ్యులను కూడా కలవకుండా ఉండడం అనేది కొంచెం ఆశ్చర్యం కలిగించే విషయం. కెసిఆర్ అధికారంలో ఉండగా ప్రగతి భవన్‌లో ఉన్నా, ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో ఉన్నా ఆయన్ని కలవాలంటే కుటుంబ సభ్యులు కూడా అపాయింట్మెంట్ కోరాల్సిందేనని చాలాసార్లు విన్నాం. ముఖ్యమంత్రిని తాము కలవకుండా అడ్డుకుంటున్నాడని ఆయన రోజువారీ వ్యవహారాలు చూసుకునే మాజీ రాజ్యసభ సభ్యుడు, ఆయన సమీప బంధువు సంతోష్ కుమార్‌ను నిందిస్తూ ఉండేవారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్న సామెత చందంగా ముఖ్యమంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా సొంత బిడ్డలను కూడా కలవకుండా ఉండడం అనేది అసహజంగానే ఉంటుంది.ఇప్పుడు అసలు విషయానికి వద్దాం. మాజీ ఎంపి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తండ్రికి ముఖాముఖి చెపితే సరిపోయే విషయాలను ఓ లేఖలో రాసి పంపారు. సహజంగా తండ్రులకు కూతుళ్లపట్ల ప్రేమ ఎక్కువ ఉంటుంది. ఆడపిల్లలకు తల్లికంటే తండ్రిదగ్గర చనువు ఎక్కువ. కవిత ఆ చనువు ఎందుకు కోల్పోయారు అన్నది ప్రశ్న. పార్టీ నడుస్తున్న తీరు, రజతోత్సవ సభలో తండ్రి ప్రసంగం సాగిన తీరు, ఆయన వ్యవహార శైలి మీద కొన్ని మంచి విషయాలు, కొన్ని మారాల్సిన విషయాలు వివరిస్తూ ఆమె మే రెండవ తేదీన రాసిన లేఖ అది. దాదాపు 20 రోజుల తర్వాత ఈ లేఖ మీడియాకు లీక్ అయింది. ఒకటి.. తండ్రికి రాసిన లేఖ ఎలా లీక్ అయింది? రెండు.. ఎవరు లీక్ చేసి ఉంటారు? 24 గంటల్లోనే దీనిమీద మీడియా బోలెడు చర్చ చేసింది. కొందరు ఇది నకిలీ ఉత్తరం అన్నారు. మరికొందరు కాంగ్రెస్ వారే రాయించారు, వారే లీక్ చేశారన్నారు. మరికొందరు కవిత తనంతటతానే దీన్ని లీక్ చేయించారని ప్రచారం చేశారు. ఇంకాస్త దూరం వెళ్లి ఆమె కాంగ్రెస్‌లో చేరబోతున్నారని ఒక వాదన, లేదు లేదు బిజెపితో కలవబోతున్నారని మరొక వాదన, ఈ రెండూ కాదు, సొంత పార్టీ పెట్టబోతున్నారని ఇంకొక వాదన, అసలు ఇదంతా కెసిఆర్ ఆడిస్తున్న డ్రామా అని మరో వాదన జోరందుకున్నాయి. శుక్రవారం సాయంత్రం కవిత అమెరికా నుండి తిరిగి వచ్చి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడేంతవరకూ మీడియాకు బోలెడు మేత దొరికింది. ఏది తోచితే అది రాశారు, మాట్లాడారు. కవిత ఆ లేఖ తాను రాసిందేనని, పార్టీలో ఉన్న కోవర్టులు ఆ లేఖను మీడియాకు లీక్ చేసి ఉంటారని, తాను పార్టీకి నష్టం చేసే మనిషిని కాదని వివరించేదాకా లేఖ అసలు, నకిలీ గురించి చాలా చర్చ జరిగింది. చాలా రోజులుగా భారత రాష్ట్ర సమితిలో కెసిఆర్ కింద మూడు అధికార కేంద్రాలు పని చేస్తున్నాయని, వాటి మధ్య అంతర్గత ఘర్షణ తీవ్రంగా ఉన్నదని వార్తలు వస్తూనే ఉన్నాయి. కవిత లేఖ, దానిమీద శుక్రవారంనాడు ఆమె స్పందన.. ఆ వార్తలను ధ్రువీకరిస్తున్నాయి. కవిత రాసిన లేఖలో ఉన్న అంశాలనే గనక తీసుకున్నట్లయితే నిజానికి కెసిఆర్ పరిగణనలోకి తీసుకొని మార్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. ఇంతకుముందే చెప్పుకున్నట్టుగా ఒక్కొక్క ముఖ్యమంత్రి వ్యవహార శైలి ఒక్కో రకంగా ఉంటుంది. కెసిఆర్ తన ఫీడ్ బ్యాక్ కోసం ఎటువంటి పద్ధతులను అనుసరిస్తారో మనకు తెలియదు. జనంలో మనం తిరగనప్పుడు వాళ్ళు మన గురించి ఏమనుకుంటున్నారు అనే విషయం తెలుసుకోవడానికి ఏ ముఖ్యమంత్రి అయినా కొన్ని పద్ధతులు అవలంబిస్తారు. కెసిఆర్ ఎటువంటి పద్ధతి అవలంబిస్తారో మనకు తెలియదు, కవిత మాటల ప్రకారమైతే అప్పుడప్పుడు తాను లేఖల ద్వారా ఇలాంటి ఫీడ్ బ్యాక్ ఇస్తుంటానని చెప్పారు.ఆమె లేఖలో పేర్కొన్న నెగటివ్ అంశాల విషయానికొస్తే రజతోత్సవంలో భారతీయ జనతా పార్టీని టార్గెట్ చేయకపోవడాన్ని నెగిటివ్ అంశంగా పేర్కొన్నారు. నిజమే, భారత రాష్ట్ర సమితి శ్రేణుల్లోనే గందరగోళం ఉన్నది.. భవిష్యత్తులో బిజెపితో తమది దోస్తీనా, దుష్మనీనా అని. ఎందుకంటే కెసిఆర్ మాట్లాడటం లేదు, కె.టి. రామారావు, హరీశ్ రావులాంటి వాళ్ళు ఎన్ని మాట్లాడినా అది శంఖంలో పోసిన తీర్థం కాబోదు. రజతోత్సవ సభలో వక్ఫ్ బిల్లు గురించి మాట్లాడి ఉండవలసింది, దాన్ని వ్యతిరేకిస్తున్నారా లేదా, టిఆర్ఎస్‌తో నడిచే మైనారిటీలకు ఏం చెప్పదలచుకున్నారు, ఎస్సి వర్గీకరణకు సంబంధించి కూడా ఎందుకు మాట్లాడలేదు, బిసిలకు 42% రిజర్వేషన్ల గురించి మాట్లాడలేదు.. ఇలా ఆమె పలు అంశాలను ప్రస్తావించారు.వీటిలో ప్రధానమైనవి ఉద్యమ నేతలను పట్టించుకోకపోవడం, కొద్దిమందికే అందుబాటులో ఉండడం అనేవి ప్రధానమైన విషయాలు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకుడు వీలైనంత ఎక్కువమందిని కలిస్తేనే ప్రజామోదం పొందగలుగుతాడు. ఆ విషయాలను కవిత ప్రస్తావించారు.

# మైసూర్ పాక్‌లో ..పాక్ మాయం !

జయపుర,మైసూర్పాక్‌లో పాక్ మాయమయ్యింది. దాని స్థానంలో శ్రీ వచ్చిచేరింది. ఇప్పుడు మైసేర్ పాక్ స్వీటుకాస్తా మైసూర్ శ్రీ గా మారింది. వినడానికి ఆశ్యర్యంగా ఉన్నా..ముమ్మాటికీ నిజం. పాక్ అనే శబ్దం లేకుండా స్వీట్ల పేర్లన్నీ మారాయి. చివరన అన్నింటికీ శ్రీ చేరింది. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్‌పై యావత్ భారతీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న ఆ దేశాన్ని అంతర్జాతీయ సమాజంలో ఏకాకిని చేయాలన్న డిమాండ్లు వినిపించాయి. ఇదే సమయంలో నెట్టింట మరో చర్చ మొదలైంది. మైసూర్‌పాక్ పేరును మార్చాలని కొందరు సోషల్‌మీడియాలో ప్రతిపాదనలు చేశారు. కొందరైతే మరో అడుగు ముందుకేసి దీనిపై మీమ్స్ కూడా చేశారు. ఈ డిమాండ్ ఓ వ్యాపారికి బాగా నచ్చేసింది. అందుకే తమ దుకాణంలో విక్రయించే స్వీట్లలో 'పాక్' పదాన్ని తీసేసి కొత్త పేర్లు పెట్టారు. మైసూర్ పాక్ ను 'మైసూర్ శ్రీ'గా మార్చేశారు.రాజస్థాన్‌లోని జైపుర్‌లో గల ప్రముఖ 'త్యోహార్ స్వీట్స్' యజమాని ఈమేరకు తమ దుకాణంలో మార్పులు చేశారు. మైసూర్ పాక్‌తో పాటు–.. మోతీ పాక్, ఆమ్ పాక్, గోండ్ పాక్ పేర్లను మార్చి.. మైసూర్ శ్రీ, మోతీ శ్రీ, ఆమ్ శ్రీ, గోండ్ శ్రీ అని కొత్త పేర్లు పెట్టారు. స్వర్ణ భాషం పాక్, చాందీ భాషమ్ పాక్‌ను కూడా స్వర్ణ శ్రీ, చాందీ శ్రీగా మార్చేశారు. దీనిపై ఆ దుకాణం యజమాని మాట్లాడుతూ.. దేశభక్తి అనేది కేవలం సరిహద్దుల్లో ఉంటే సరిపోదు. ప్రతి పౌరుడికి దేశంపై ప్రేమ ఉండాలి. అందుకే మేం ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.వాస్తవానికి 'పాక్' అనే పదం పాకం నుంచి వచ్చింది. కొన్ని భాషల్లో చక్కర లేదా బెల్లంతో చేసే పదార్థాన్ని కూడా పాకం అని పిలుస్తాం. ఇక్కడ ఈ పదానికి పాకిస్థాన్‌తో సంబంధం లేకపోయి నప్పటికీ.. దాన్ని పలికే శబ్దం ఆ దేశాన్ని గుర్తుచేసేలా ఉండటంతోనే పేరు మార్చినట్లు తెలిపారు. 'శ్రీ' అనే పదం శుభానికి సూచికగా పెట్టినట్లు పేర్కొన్నారు. మొత్తానికి ఉత్తరాది మైసూర్ శ్రీ ఇప్పుడు ఫేమస్సానుంది.

# సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

శ్రీకాకుళం, వచ్చేది వర్షాకాలం. వర్షాకాలంఓనే సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతాయి. ఏటా ఇలాంటి సమ్యలు చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. వర్షాకాల వ్యాధులపై చైతన్యం చేయాల్సి ఉంది. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. కరోనా మరోమారు భయపెడుతోంది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలకు అలవాటు పడాలి. ఇది కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్థాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. అయితే కరోనా పరిస్తితి కారణంగా ఇప్పుడు ప్రజలకు గుణపాఠం వచ్చిందనే చెప్పాలి. అయితే ఇది ఎంతకాలం అన్నది కూడా చూడాలి. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం మరో రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు.

# ప్రజా సమస్యలను గాలికొదిలేసిన మోడీ

గుంటూరు,నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేట్ సంస్థలను కార్పొరేట్ రంగాలకు ధారాదత్తం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గుంటూరులోని ఆంధప్రదేశ్ ప్రజా నాట్య మండలి రాష్ట్ర స్థాయి పాటలు, కళారుపాలా శిక్షణా శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగించారు. కమ్యూనిస్టులను, కమ్యూనిస్టు భావాజాలను అంతం చేయాలని చూస్తున్నారని చెప్పారు. బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా సమస్యలను ప్రజలను గాలికి వదిలేశారని ఆరోపించారు. విదేశాలలో ఉన్న 70 లక్షల కోట్లు ఎన్నికలలో గెలవగానే భారత్ కు తెప్పిస్తానని చెప్పి మాట తప్పారన్నారు. ప్రజా సమస్యలు తీర్చకుండా ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడు తున్నారని రామకృష్ణ ఆరోపించారు. పహాల్గాం ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు చనిపోవడం బాధాకరమన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో సరికొత్త నాటకానికి తెరలేపారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు భయపడి మోడీ యుద్ధాన్ని ఆపేశారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఒక నరహంతక పరిపాలన చేస్తుందని విమర్శించారు. విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలపై పోరాటానికి సన్నద్ధం అవుతామని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

# రేవంత్ లౌక్యం తెలిసిన సీఎం !



హైదరాబాద్,భారతీయ జనతా పార్టీతో యుద్ధమే అని ప్రకటించుకున్న తర్వాత ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్ ఎప్పుడూ ప్రధాని హోదాలో ఉన్న మోదీతో ఎదురుపడేందుకు ఆసక్తి చూపించలేదు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చినా సరే స్వాగతం చెప్పడానికి కేసీఆర్ కు మనసు అంగీకరించలేదు. ఇక నీతి ఆయోగ్ లాంటి సమావేశాల్లో అసలు పాల్గొనలేదు. దీంతో మోదీతో కేసీఆర్ బంధం పూర్తిగా తెగిపోయింది. నిజానికి అంతగా దూరం పెంచుకోవాల్సిన అవసరం లేదు. రాజకీయంగా విబేధించడం వేరు.. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం వేరు. ఈ తేడాను కేసీఆర్ గుర్తించలేకపోయారు.ప్రస్తుతం దేశంలో ఉన్న ముఖ్యమంత్రుల్లో మోదీని తీవ్రంగా వ్యతిరేకించేవారిలో స్టాలిన్ మొదటి వరుసలో ఉంటారు. కానీ ఆయన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యారు. మోదీతో వ్యక్తిగతంగా నవ్వుతూ మాట్లాడారు. ఇలాంటి లౌక్యాన్ని రేవంత్ రెడ్డి పాటిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సీఎంగా ఉన్నప్పటికీ.. రాజకీయాలకు సంబంధం లేని అధికారిక వ్యవహారాల్లో ప్రధాని మోదీతో సన్నిహితంగా మెలుగుతున్నారు. దాని వల్ల పార్టీ హైకమాండ్ లో తనపై అనుమానం తలెత్తుతుందని ఆయన సందేహపడటం లేదు. రాజకీయంగా విబేధించాల్సిన చోట గట్టిగానే తన వాయిస్ వినిపిస్తున్నారు.రేవంత్ రెడ్డి డబుల్ గేమ్ ఆడుతున్నారని కొంత మంది విమర్శలు చేయవచ్చు కానీ..రేవంత్ రాజకీయంగా ఎప్పుడూ బీజేపీ, మోదీని సమర్థించే ప్రయత్నం చేయలేదు. పాలన చేయాల్సింది రేవంత్ కాబట్టి కేంద్రం సహకారం ఎంత అవసరమో ఆయనకు బాగా తెలుసు కాబట్టి దానికి తగ్గట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ మాత్రం లౌక్యం తెలియక కేసీఆర్ ఇబ్బంది పడ్డారు. రేవంత్ చాలా చాకచక్యంగా..లౌక్యంగా రాజకీయం చేస్తున్నారు.

# కవిత వెనక కమల దళం?

హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ, పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కల్వకుట్ల కవిత పార్టీ అధ్యక్షుడికి రాసిన లేఖ తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ప్రకంపనలు సృష్టిస్తోంది. మరోవంక కవిత లేఖలో పేర్కొన్న అంశాలతో పాటుగా.. అందుకు సంబంధించి ఆమె చేసిన వ్యాఖ్యలు, విమర్శలు, వీటన్నింటి మించి గత కొంతకాలంగా ఆమె పార్టీతో, ఫ్యామిలీతో సంబంధం లేకుండా సొంత పంథాలో సాగిస్తున్నరాజకీయాలను గమనిస్తే.. ఆమె వెనక ఇంకెవరో ఉన్నారనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ లో తనకు అండదండ రెండూ లేవనే నిర్ణయానికి వచ్చి.. ఆమె మరో మార్గంలో ముందుకు సాగుతున్నారని అంటున్నారు.అయితే రాష్ట్ర రాజకీయాల్లో ఇంతలా సంచలనం సృష్టించిన కవిత లేఖ పై బీఆర్ఎస్ సహా ప్రధాన రాజకీయ పార్టీలు, వేచి చూచే ధోరణిలోనే ఉన్నాయి. పెద్దగా స్పందించలేదు. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కవిత లేఖను పరస్పర ఆరోపణలకు వినియోగించుకుంటున్నాయి. ఆచి తూచి స్పందిస్తున్నాయే కానీ.. గట్టిగా రియాక్ట్ కావడం లేదు. ఆమె రాసిన లేఖను గానీ, ఆమె చేసిన వ్యాఖ్యలను గానీ, అంతగా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులలో ఒక్క కేటీఆర్ మినహా మరెవరూ స్పందించలేదు. కేటీఆర్ కూడాజజ పార్టీ అంతర్గత సమస్యలను పార్టీలో చర్చించు కోవాలే కానీ, బయట మాట్లాడడం మంచింది కాదని పరోక్షంగా కవితను హెచ్చరించారు. అలాగే, కవిత లేఖ అంత పెద్ద విషయం కాదని కేటీఆర్ కవిత రేపిన దుమారాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేశారు. అలాగే.. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్ లో రెంత్ రెడ్డి పేరున్న విషయాన్ని పైకి తెచ్చి చర్చను పక్కదారి పట్టించడానికి ప్రయత్నించారు.మరోవంక కాంగ్రెస్, బీజేపీలు గుమ్మడికాయ దొంగ ఎవరంటే బుజాలు తడుముకున్నట్లుగా.. ఇదంతా ఫ్యామిలీ డ్రామా అన్నట్లుగా కొట్టి పారేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో కేసీఆర్ చుట్టూ దయ్యాలు చేరాయంటూ కవిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు , మంత్రులు వివరణ కోరుతున్నారు. ఆ దయ్యాల పేర్లు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే.. కేంద్ర మంత్రి బండి సంజయ్ సహా బీజేపీ ఎంపీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జాయింట్ గా డ్రామాలు ఆడుతున్నాయని అంటున్నారు. అయితే నిజంగానే.. ఇది ఫ్యామిలీ డ్రామానే అయినా, ఈ డ్రామాలో బీఆర్ఎస్ తో పాటుగా కాంగ్రెస్, బీజేపీ పాత్ర కూడా ఉందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. నిజానికి పైకి కనిపిస్తున్న చిత్రానికి, లోపల జరుగతున్నతతంగానికి మధ్య పొంతన, పోలిక లేదని అంటున్నారు. ముఖ్యంగా, 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు, వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న బీజేపీ, బీఆర్ఎస్ ను బలహీన పరిచేందుకు, ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో చిక్కిన కవితను, పావుగా ఉపయోగించుకునే



వ్యూహాన్ని అమలు చేస్తోందని అంటున్నారు. నిజానికి ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై, బెయిలుపై విడుదలై వచ్చిన తర్వాతనే కవిత ధోరణిలో మార్పు వచ్చిందని, ముఖ్యంగా తాను కష్టాల్లో ఉన్న సమయంలో తనను పార్టీ, ఫ్యామిలీ పట్టించుకోలేదనే బాధ ఆమెలో ఉందని మెల్ల మెల్లగా బయటకు వస్తోందని అంటున్నారు. ఈ నేపధ్యంలోనే, కవిత బీజేపీకి దగ్గరయ్యారని, అంటున్నారు. అందుకే జైలు నుంచి బెయిలు పై వచ్చిన తర్వాత కవిత బీఆర్ఎస్ తో అంటీ ముట్టనట్లు ఉండడమే కాకుండా, తెలంగాణ జాగృతి వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేస్తున్నారు. మరో వంక సామాజిక తెలంగాణ నినాదాన్ని పైకి తీసుకు వచ్చి, బీసీల్లో పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలనే డిమాండ్ తో పాటుగా బీసీల హక్కుల పోరాటాల్లో పార్టీతో సంబంధం లేకుండా తెలంగాణ జాగృతి తరపున పాల్గొన్నారు. అయితే.. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నీడ అయినా తనమీద పడకుండా కవిత జాగ్రత్త పడుతున్నారు. చివరకు అమెరికా నుంచి శుక్రవారం (మే 23) హైదరాబాద్ చేరుకున్న సమయంలో కూడా ఆమెకు స్వాగతం పలికేందుక వచ్చిన వారిలో, కుల సంఘాలు, జాగృతి కార్యకర్తలతో పాటుగా కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నా, ఏ ఒక్కరూ కూడా గులాబీ జెండా పట్ట లేదు, కేసీఆర్ కు జై కొట్టలేదు. అంటే.. బీఆర్ఎస్ తో సంబంధం లేకుండా కవిత, సామాజిక తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారని, ఈ ప్రయత్నాల్లో ఆమె సక్సెస్ అయితే, సామాజిక తెలంగాణ నినాదంగా సొంత పార్టీని ఏర్పాటు చేయవచ్చని అంటున్నారు. అయితే.. ఇదంతా కవిత బీజేపీ కనుసన్నల్లో చేస్తున్నారని అంటున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత తార స్థాయికి చేరిందిజ రానున్న మూడున్నర ఏళ్లలో కాంగ్రెస్ ఇంకా బలహీనపడుతుందని అంచనా వేస్తున్న కమల దళం, కవితను ప్రయోగించి, బీఆర్ఎస్ ను బలహీన పరిస్తే.. కొత్త సమీకరణాలతో, కొత్త పొత్తులతో రాష్ట్రంలో పాగ వేయవచ్చని భావిస్తోంది. అందులో భాగంగానే కవిత ఎపిసోడ్ తెర పైకి వచ్చిందని అంటున్నారు.

# రాబోయే ఎలక్షన్‌లలో చాలా పోటీ ఉంటుంది..

అనంతపురం: రాబోయే ఎలక్షన్‌లలో చాలా పోటీ ఉంటుందని, గ్రామంలోని నాయకులు ప్రజలతో మమేకం కావాలని అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సూచించారు.తాడిపత్రి ప్రజలకు జేసీ కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందని, తమ కుటుంబానికి తాడిపత్రి ప్రజలే దేవుళు ్ల అని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా రాజకీయాల్లో కొనసాగాలంటే ప్రజల్లో ఉండాలని జేసీ చెప్పుకొచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటా అని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి తెలిపారు.తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ%ౌ% 'గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నానో మీ అందరికీ తెలుసు. నేను ఆరోజు ధైర్యంగా ఉన్నాను అంటే మీ వల్లే. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంట్లోకి వచ్చినప్పుడు నాకు మూడు ఆప్షన్లు మిగిలాయి. ఒకటి కేతిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లాలి, రెండు వాడితో తలబడాలి, మూడు నేను పైకి పోవాలి. నియోజకవర్గంలో ఎవరైనా రాజకీయాల్లో కొనసాగాలంటే ప్రజల్లో ఉండాలి. తాడిపత్రి ప్రజలకు జేసీ కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. రాబోయే ఎలక్షన్‌లలో చాలా పోటీ ఉంటుంది. గ్రామంలోని నాయకులు ప్రజలతో మమేకం కావాలి. మా కుటుంబానికి తాడిపత్రి ప్రజలే దేవుళ్లు' అని చెప్పా



రు.'తాడిపత్రి నియోజకవర్గంలోని ప్రజలు వారి సమస్యలను ఎప్పుడైనా నా దృష్టికి తీసుకురావచ్చు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడు వారికి అందుబాటులో ఉంటా. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. వారు మీసం మేలేసి నా వెంట నడిచారు. ఆ ధైర్యం వల్లే ఈరోజు మనం గెలవగలిగాం' అని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అన్నారు.

# లాలూ కుటుంబంలో సోషల్ మీడియా పోస్ట్ చిచ్చు..



పాట్నా:బీహార్ ఎన్నికల వేళ లాలూ కుటుంబంలో కలహాలు బయటపడ్డాయి. ఒక సోషల్ మీడియా పోస్ట్ చిచ్చు రాజేసింది. కన్న కొడుకునే పార్టీ నుంచి బహిష్కరించారు తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్. కొడుకు తేజ్ ప్రతాప్ సింగ్ ను పార్టీ నుంచి బహిష్కరించారు లాలూ ప్రసాద్ యాదవ్. ఆర్జేడీ నుంచి తేజ్ ప్రతాప్ సింగ్ ను ఆరేళ్ల పాటు బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నుంచే కాదు తేజ్ ప్రతాప్ సింగ్ ను కుటుంబం నుంచి కూడా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు లాలూ. తేజ్ ప్రతాప్ యాదవ్ బాధ్యత లేకుండా ప్రవర్తించాడని మండిపడ్డారు లాలూ ప్రసాద్ యాదవ్.తన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ ను పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరిస్తున్నట్లు ఆయన తండ్రి, రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ప్రకటించారు. తన కొడుకు వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించేలా చేస్తున్న చర్యలు.. సామాజిక న్యాయం కోసం పార్టీ చేస్తున్న పోరాటాన్ని బలహీనపరుస్తున్నాయని లాలూ వాపోయారు. తేజ్ ప్రతాప్ ప్రవర్తన కుటుంబ విలువలు, సంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని సీరియస్ అయ్యారు. ఈ కారణాలతో అతడిపై వేటు వేసినట్లు వివరించారు. ఇకపై తేజ్ ప్రతాప్‌కు ఆర్జేడీ పార్టీలో, తమ కుటుంబంలో స్థానం లేదని స్పష్టం చేశారు లాలూ ప్రసాద్ యాదవ్.

అసలేం జరిగిందంటే..

తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానంటూ ఫేస్ బుక్ లో తేజ్ ప్రతాప్ యాదవ్ పెట్టిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్ గా మారిన సంగతి తెలిసిందే. దాంతో లాలూ ఈ చర్యలు తీసుకున్నారు. శనివారం తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో మహిళతో ఉన్న ఫొటో పెట్టారు. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై రచ్చ జరిగింది. ఆ వెంటనే తేజ్ వివరణ ఇవ్వాల్సి వచ్చింది. తన సోషల్ మీడియాను ఎవరో హ్యాక్ చేశారని ఆయన తెలిపారు. తన కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసేందుకే ఎవరో ఇలాంటి పోస్ట్ చేశారని ఆరోపించారు. ఆ ఫొటో సైతం ఎడిట్ చేసిందన్నారు. కానీ, జరగాల్సిన నష్టం జరిగిపోయింది. తేజ్ ప్రతాప్ యాదవ్ పై వేటు పడింది."నా పెద్ద కొడుకు చేస్తున్న పనులు.. మా కుటుంబ విలువలకు అనుగుణంగా లేవు. ప్రస్తుత పరిస్థితుల్లో నేను అతడిని పార్టీ నుండి, కుటుంబం నుండి తొలగిస్తున్నా. ఇక నుండి, అతనికి పార్టీ, కుటుంబంలో ఎటువంటి పాత్ర ఉండదు. అతడిని ఆరేళ్ల పార్టీ నుండి బహిష్కరిస్తున్నా" అని లాలూ తెలిపారు.సోషల్ మీడియాలో డిలీట్ చేయబడిన పోస్ట్ తేజ్ ప్రతాప్ తొలగింపునకు దారితీసింది. తేజ్ ప్రతాప్ యాదవ్ ఫేస్‌బుక్ ప్రొఫైల్ నుండి ఒక మహిళతో ఉన్న ఫోటో నిన్న షేర్ చేయబడింది. ఆ మహిళను అనుష్క యాదవ్ గా చెప్పారు. తామిద్దరం 12 సంవత్సరాలుగా రిలేషన్ షిప్ లో ఉన్నామని చెప్పారు. "మేమిద్దరం 12 సంవత్సరాలుగా ఒకరికొకరం తెలుసు. ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకుంటున్నాము. మేము రిలేషన్ షిప్ లో ఉన్నాము. చాలా కాలంగా దీన్ని మీ అందరితో పంచుకోవాలనుకున్నా. కానీ సరైన పదాలు దొరకలేదు. ఈరోజు, ఈ పోస్ట్ ద్వారా, నేను ఓపెన్ అవుతున్నా. మీరందరూ అర్థం చేసుకుంటారని నేను ఆశిస్తున్నాను" అని తేజ్ ఒక పోస్ట్ పెట్టారు.తేజ్ పెట్టిన ఈ పోస్ట్ పై రచ్చ రచ్చ జరిగింది. తీవ్ర విమర్శలు వచ్చాయి. తేజ్ పై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇది వరకే ఆ మహిళతో రిలేషన్ షిప్ లో ఉంటే.. మరి బీహార్ మాజీ మంత్రి చంద్రికా రాయ్ కుమార్తె ఐశ్వర్యను 2018లో ఎందుకు వివాహం చేసుకున్నారని పలువురు తేజ్ ను నిలదీశారు. కాగా, తేజ్ ప్రతాప్, ఐశ్వర్య వివాహం జరిగిన కొన్ని నెలల తర్వాత విడిపోయారు. ఫేస్‌బుక్ పోస్ట్ దుమారం రేపడంతో కాపటికే తేజ్ ప్రతాప్ స్పందించారు. వివాదానికి తెరదించే ప్రయత్నం చేశారు. తన అకౌంట్ హ్యాక్ అయిందని చెప్పారు. "నా సోషల్ మీడియా అకౌంట్ హ్యాక్ చేయబడింది. నా ఫొటోలను ఎడిట్ చేశారు. తప్పుగా చూపించారు" అని తేజ్ ప్రతాప్ యాదవ్ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అంతేకాదు.. ఆయన అకౌంట్ నుంచి ఆ పోస్ట్ డిలీట్ కూడా అయ్యింది. ఈ వ్యవహారంపై తేజ్ ప్రతాప్ తమ్ముడు, ఆర్జేడీ కీలక నేత తేజస్వి స్పందించారు. ఇలాంటి వాటిని సహించేది లేదన్నారు. "మేము మా పని చేస్తున్నాము, బీహార్‌కు అంకితభావంతో ఉన్నాము. ప్రజల సమస్యలను లేవనెత్తుతున్నాము. నా అన్నయ్య విషయానికొస్తే, రాజకీయ జీవితం వ్యక్తిగత జీవితం భిన్నంగా ఉంటాయి. ఆయనకు తన వ్యక్తిగత నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంది. ఆయన పెద్దవాడు. నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంది" అని తేజస్వి అన్నారు. ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి ఆర్జేడీ సిద్ధమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మయంలో తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్ పోస్ట్, ఆయన వ్యక్తిగత జీవితం గురించి చర్చలు.. ఆర్జేడీని ఇబ్బందుల్లోకి నెట్టాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ప్రభుత్వం కీలక నిర్ణయం.. తాజ్ మహల్ వద్ద యాంటీ డ్రోన్ సిస్టం




న్యూఢిల్లీ,కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తాజ్‌మహల్ వద్ద మరింత భద్రతను పెంచనుంది. అక్కడి పరిసర ప్రాంతాల్లో యాంటీడ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌లోని జమ్మూ, పంజాబ్, రాజస్థాన్‌లో డ్రోన్లు, మిసైల్స్‌తో పాక్ దాడులకు యత్నించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఆ దాడులను తిప్పికొట్టింది. అయితే తాజాగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తాజ్‌మహల్ వద్ద మరింత భద్రతను పెంచనుంది. అక్కడి పరిసర ప్రాంతాల్లో యాంటీడ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తాజ్‌మహల్ వద్ద ప్రస్తుతం CISF, యూపీ పోలీసులు భద్రత కల్పిస్తున్నారు. అక్కడ డ్రోన్ దాడులను కూడా తిప్పికొట్టేందుకు రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. దీనికి 78 కిలోమీటర్ల వరకు రేంజ్ ఉంటుందని తెలిపారు. తాజ్‌మహల్ ప్రధాన డోమ్‌కు 200 మీటర్ల వరకు పరిసరాలను రక్షించేలా ఈ రక్షణ వ్యవస్థ ఉంటుందని పేర్కొన్నారు. తాజ్‌మహల్‌కు ఆదివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆర్‌డీఎక్స్‌తో తాజ్‌మహల్‌ను పేల్చేస్తామని కేరళ నుంచి అధికారులకు ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తాజ్‌మహల్ వద్ద హై అలర్ట్ ప్రకటించారు. పోలీసులు, బాంబు నిర్వీర్యం దళం, డాగ్ స్క్వాడ్, భారత పురావస్తు సర్వే అధికారులు,CISF భద్రతా దళం మూడు గంటల పాటు తాజ్‌మహల్ ప్రాంగణంలో తనిఖీలు చేశారు. కానీ అక్కడ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదు. దీంతో తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టిదిట్టం చేశారు. ఉత్తరప్రదేశ్ టూరిజం శాఖకు, ఢిల్లీ పోలీసులకు గుర్తు తెలియని మెయిల్ ఐడీ నుంచి తాజ్‌మహల్‌కు బెదిరింపు సందేశం వచ్చింది. ఆర్‌డీఎక్స్ బాంబుతో తాజ్‌మహల్‌ను పేల్చేస్తామని అందులో హెచ్చరించారు. రంగంలోకి దిగిన పోలీసులు దీనిపై విచారణ ప్రారంభించారు. చివరికి ఇది ఫేక్ ఈమెయిల్ అని తేలింది. సైబర్ సెల్ పోలీస్ స్టేషన్‌లో కూడా దీనిపై కేసు నమోదైంది. ప్రస్తుతం పోలీసులు నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

# భక్తులతో యాదాద్రి కిటకిట...

యాదగిరి గుట్ట, వేసవి సెలవుల నేపథ్యంలో భక్తులతో యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయం కిటకిటలాడుతోంది. ఆదివారం వేకువ జాము నుంచే ఆలయ ఈవో వెంకట్రావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తెలవారు జాము నాలుగు గంటల నుండే దేవాలయంలో మాడ వీధులు, ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.పరిశుభ్రత పనులన్నియు ఉదయము 4.30 గంటల లోపు తప్పని సరిగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీ స్వామి వారి అభిషేకంలో పాల్గొన్న భక్తులతో మాట్లాడి దేవస్థాన వసతి , పలు సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.



# తెరపైకి ఓయూ భూవివాదం..ప్రైవేటు వ్యక్తులకు ఓయూ క్వార్టర్లు



హైదరాబాద్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వివాదం కొనసాగుతుండగానే మరోవైపు ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) భూ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఓయూ ప్రొఫెసర్ క్వార్టర్స్ ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. యూనివర్సిటీలో ప్రొఫెసర్లకు కేటాయించాల్సిన క్వార్టర్లను కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు కేటాయించి పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ విషయమై విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.కాగా ప్రైవేట్ వ్యక్తులకు క్వార్టర్స్ ఇవ్వడంపై ఓయూ వీసీ (వైస్ చాన్సలర్)ని విచారించగా క్వార్టర్లు ప్రవేటు వ్యక్తులకు ఇచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అయితే, గతంలో ఇన్‌ఛార్జి వీసీగా ఉన్న వ్యక్తి ఈ క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని ప్రస్తుతం ఉన్న వీసీ వెల్లడించారు. మినిట్స్ బుక్‌లో ఈ విషయాన్ని తనూ చూసినట్లు పేర్కొన్నారు. అంతేతప్ప తనకు ఈ విషయంతో సంబంధం లేదని వెల్లడించారు. ఈ విషయాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా పరిగణిస్తున్నా యి. నిబంధనలకు విరుద్ధంగా అలా ప్రైవేటే వ్యక్తులకు కేటాయించడం పై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓయూ ప్రొఫెసర్లు ఈ క్వార్టర్స్ లో నివాసముంటే వారి వేతనం నుంచి నెలకు 40,000 కట్ చేస్తారని కానీ,దాన్ని ప్రైవేట్ వ్యక్తుల కు మా త్రం కేవలం 1,000కే ఇవ్వడాన్ని వారు తప్పు పడుతున్నారు.కాగా ఈ విష యంపై సమగ్ర విచారణ జరిపి ఈ ఇష్యూకు కారణమైన వారిపై కఠినంగా వ్య వహరించాలని డిమాండ్ చేశారు. అయితే ఓయూలో ఉన్న క్వార్టర్లు ప్రొఫెసర్ల కు కేటాయిస్తే వారినుంచి రూ.40000 వసూలు చేస్తున్నారని, అంతమొత్తం చెల్లించడానికి వారు ఆసక్తి చూపకపోవడం వల్ల అవి ఖాళీగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

# బీసీ ఉద్యమం గ్రామస్థాయి నుంచి బలోపేతం కావాలి

ఖైరతాబాద్, బీసీల రాజ్యాధికారమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోటి బీసీ కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు చిరంజీవులు, సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్‌తో కలిసి ప్రారంభించారు.అనంతరం మధుసూదనాచారి మాట్లాడుతూ.. దేశంలో అనేక ప్రభుత్వాలు ఏర్పడినా బీసీల సంక్షేమానికి ఎవరూ పాటుపడలేదని అన్నారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కుతూ వారి సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. బీసీల్లో చైతన్యం ప్రారంభమైందని, అది మండల స్థాయికి చేరిందని, గ్రామ స్థాయి నుంచి బలోపేతం కావాల్సిన అవసరం ఉందని



అభిప్రాయపడ్డారు. గతంలో బీసీలు ఓట్లు వేసి సంక్షేమ పథకాలను అడుక్కునే

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com